Sweken
WE ARE HIRING !!
POWER BI SPECIALIST
DATA ANALYST
INTERESTED CANDIDATES
PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలకు విలేఖరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్: 7013785256, 9959867303

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 147 విశాఖపట్నం, 21 మార్చి 2025 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



## టీమిండియాకు బీసీసీఐ భారీ నజరానా

టీమిండియాపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కాసుల వర్షం కురిపించింది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 లో విజేతగా నిలిచినందుకు భారీ క్యాష్ రివార్డు ప్రకటించింది. ఈ మెగా వన్డే టోర్నీలో ఐదింటికి ఐదు మ్యాచ్‌లు గెలిచి అజేయంగా చాంపియన్‌గా నిలిచిన రోహిత్ సేనకు రూ. 58 కోట్ల నజరానా ఇచ్చింది.

- వివరాలు 8లో


## ఏపీలో కొత్త ఆవిష్కరణలకు కృషి: బిల్ గేట్స్

2



# ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం

-అసెంబ్లీలో సీఎం చంద్రబాబు



**అమరావతి:** బుడగజంగం కులాన్ని ఎస్సీలో చేర్చాలంటూ చేసిన తీర్మానాన్ని ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసన సభ తీర్మానాన్ని కేంద్రానికి పంపనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని గతంలోనే చెప్పాం.. ఆ మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. అసెంబ్లీలో ఆయన ఎస్సీ వర్గీకరణపై మాట్లాడారు. "అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే సమస్య పరిష్కారం అవుతుందని గతంలోనే చెప్పాను. జిల్లాల వారీగా కేటగిరి విభజన చేయాల్సి ఉంటుంది. జనగణన తర్వాత మరోసారి జిల్లాల వారీగా కేటగిరిల విభజన చేసేందుకు సిద్ధంగా ఉన్నాం"

"ఏబీసీడీ కేటగిరి విభజన కోసం 1996లో కమిటీ వేశాం. ఉమ్మడి ఏపీలో రేషనలైజేషన్, కేటగిరిలపై 2000 సంవత్సరంలో చట్టం చేశాం. ఆ చట్టాన్ని కోర్టు కొట్టి వేసింది. ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందేనని ఉషా మెహ్రా కమిషన్ నివేదిక ఇచ్చింది. స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లపై కూడా కమిటీ అధ్యయనం చేసింది. ఎస్సీ వర్గీకరణ సాకారం కావడంలో నా ప్రయాణం కూడా సుదీర్ఘంగా సాగింది. మొదట కమిటీ వేసినప్పటి నుంచి సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు ఉండటం నా అదృష్టం. సామాజిక న్యాయం కోసం పరితపించిన మహా నాయకుడు ఎన్టీఆర్. పేదల కోసం శాశ్వత గృహనివాస పథకం తీసుకొచ్చిన మొదటి వ్యక్తి ఆయన. ఎస్సీల పట్ల వివక్ష ఇంకా కొనసాగుతుండటం బాధాకరం. అంటరానితనం నిషేధానికి జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నేనే వేశా. అంటరానితనం రూపు

మిగతా 2లో

## రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా



రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. 15 రోజులు పాటు జరిగిన ఈ సమావేశాల్లో 9 బిల్లులకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. 85 గంటల 55 నిమిషాల పాటు వివిధ బిల్లులపై చర్చించారు. రాష్ట్ర బడ్జెట్‌తో పాటు పలు బిల్లులపై వాడీవేడీగా చర్చించారు. సహకార బ్యాంకుల అవకతవకలపై సభా సంఘాన్ని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చివరి ...(మిగతా 2లో)

## విశాఖ క్రికెట్ స్టేడియానికి వైఎస్సార్ పేరు ఉండాల్సిందే..

- మహానేత ఆనవాళ్లను తుడి చేయాలను కోవడం చంద్రబాబు అవివేకం
- కూటమి ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచనలు సాగనివ్వం
- మండిపడ్డ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్
- క్రికెట్ స్టేడియం ఎదుట వైసీపీ శ్రేణుల ఆందోళన




**విశాఖపట్నం (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తొలగించేందుకు చేస్తున్న కుట్రను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేదిలేదని వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ హెచ్చరించారు. పీఎంపాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ వైఎస్ఆర్ పేరును తొలగించాలన్న కూటమి ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచనలను సాగనివ్వమని స్పష్టంచేశారు. మహానేత ఆనవాళ్లను తుడిచేయాలని సీఎం ...(మిగతా 2లో)

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్లు..

26 మంది మావోయిస్టుల మృతి

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం



**బీజాపూర్, కాంకెర్:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పులతో దద్దరిల్లుతోంది. ఒకేరోజు బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా అమరుడైనట్లు అధికారులు వెల్లడించారు. బీజాపూర్ - దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రి అడవుల్లో నక్సల్స్ నక్కినట్లు నిఘా సమాచారం వచ్చింది. దీంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఇరు వర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ...(మిగతా 2లో)



## భారత ప్రభుత్వంపై మస్క్ 'ఎక్స్' దావా

**బెంగళూరు :** ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని సోషల్ మీడియా 'ఎక్స్' భారత ప్రభుత్వంపై దావా వేసింది. ఈ మేరకు కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చట్టవిరుద్ధంగా కంటెంట్‌ను నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్ షిప్‌నకు పాల్పడుతోందని కేంద్రంపై ఆరోపణలు చేసింది. ఐటీ చట్టం, సహ్యోగ్ పోర్టల్ నిబంధనలు తమకున్న చట్టబద్ధమైన రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయని, ఇది తమపై అనధికారికంగా సెన్సార్ చేయడం కిందికే వస్తుందని ఎక్స్ సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)(బి)ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. ఐటీ చట్టం ప్రకారం.. బ్లాక్ చేసిన కంటెంట్‌ను తొలగించక పోతే, ఎక్స్ తన చట్టబద్ధమైన రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ సెక్షన్ కింద కంటెంట్ బ్లాక్ ...(మిగతా 2లో)

## దొంగచాటు సంతకాలు చేసి సభకు డుమ్మానా?

- వైసీపీ ఎమ్మెల్యేల తీరుపై స్పీకర్ అయ్యన్న అసహనం



**అమరావతి, (విశాఖ సమాచారమ్):** వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండా సంతకాలు చేస్తుండటంపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరవడం మీరెవరైనా చూశారా? అంటూ సభ్యులను స్పీకర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సభ్యులు సభకు సగౌరవంగా హాజరుకావాల్సి ఉందన్నారు. వైసీపీ సభ్యులు ఎవరికీ కనపడకుండా దొంగచాటుగా వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేయాల్సిన పనేముందని అసహనం వ్యక్తం చేశారు. అలా వచ్చి వెళ్లడం వారి గౌరవాన్ని పెంచదన్నారు. వైసీపీ సభ్యులు బాలనాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, మత్స్యలింగం, ...(మిగతా 2లో)



- త్వరలో 6,100 పోస్టులు భర్తీ
- అసెంబ్లీలో హోం మంత్రి అనిత

## ఏపీలో 16,862 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీ

**అమరావతి, (విశాఖ సమాచారమ్):** ఏపీలో 16,862 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అసెంబ్లీలో హోం మంత్రి అనిత వెల్లడించారు. త్వరలో 6,100 ఉద్యోగాల నియామకం పూర్తవుతుందని చెప్పారు. మిగిలిన 10,762 పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అనుమతి రాగానే రిక్రూట్‌మెంట్ ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. పోలీసులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10-15 లక్షలు కుటుంబానికి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో పోలీస్ ఇన్స్‌పెక్టర్ల ప్రమోషన్లపై బీజేపీ ఎమ్మెల్యే పెన్మత్స ...(మిగతా 2లో)

## బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో పలువురు సినీ ప్రముఖులు!




**హైదరాబాద్:** బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ యాప్‌లను ప్రమోట్ చేసిన వారిలో ఉన్న ప్రముఖ నటీనటులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా మొత్తం 25 మంది ఈ జాబితాలో ఉన్నారు. సినీ ప్రముఖుల జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్ ఉన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, ...(మిగతా 2లో)

# అనకాపల్లికి అణు 'భయం'?



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లాలో అణు విద్యుత్ ప్లాంటు (న్యూక్లియర్ పవర్ ప్లాంటు) ఏర్పాటుచేయాలని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) నిర్ణయించినట్లు వార్తలు రావడంతో జిల్లా వాసులు భయాందోళనలు చెందుతున్నారు. మొత్తం 2,800 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసే ఈ అణు విద్యుత్ ప్లాంటు కోసం రెండువేల ఎకరాల మేర భూమి అవసరమవుతుందని ఎన్టీపీసీ భావిస్తోంది. ఈ మేరకు జిల్లాలో భూమి కేటాయించాలంటూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది.

ఇందుకోసం అనకాపల్లి జిల్లా అనువైనదిగా గుర్తించిన ఎన్టీపీసీ.. ఈ ప్లాంటు ఏర్పాటుకు రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. మరోవైపు.. ఈ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకోసం రోజుకు మూడు బిలియన్ గ్యాలన్ల నీరు అవసరమవుతుంది. కానీ, ఈ అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుపై ఇప్పటికే అనేక అనుమానాలున్నాయి.

### కొవ్వాడ వద్ద పోరాటాలు

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఏర్పాటుచేస్తున్న అణు విద్యుత్ ప్లాంటుపై ఇప్పటికే అనేక పోరాటాలు జరుగుతున్నాయి. ఈ ప్లాంటు ఏర్పాటువల్ల తమకు ఆరోగ్య సమస్యలు వస్తాయంటూ ప్లాంటు ఏర్పాటును స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటువంటి సందర్భంలో అనకాపల్లి జిల్లాలో ఎన్టీపీసీ తలపెట్టిన అణు విద్యుత్ ప్లాంటుపై జిల్లా ప్రజల్లోనూ భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### తెలుగు రాష్ట్రాల్లో చెరొకటి..

వాస్తవానికి.. దేశవ్యాప్తంగా 30 గిగావాట్ల (30 వేల మెగావాట్లు) సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఎన్టీపీసీ నిర్ణయించుకుంది. 'ఎన్టీపీసీ పరమాణు ఉర్జ నిగమ్' అనే సంస్థను ఇందుకు ...(మిగతా 2లో)

- 2,800 మెగావాట్ల సామర్థ్యంతో న్యూక్లియర్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు ఎన్టీపీసీ యోచన
- రెండువేల ఎకరాల భూమిని కేటాయించాలంటూ ప్రభుత్వానికి లేఖ
- దేశవ్యాప్తంగా 23 ప్రాంతాల్లో న్యూక్లియర్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- తెలుగు రాష్ట్రాల్లో చెరొకటి ఏర్పాటు చేసే అవకాశం
- భయాందోళనలో జిల్లా ప్రజలు

# 2026 నాటికి మావోయిస్టు రహితంగా భారత్

## - ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లపై అమిత్ షా



**దిల్లీ:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన కాల్పుల్లో 22 మావోయిస్టులు మృతి చెందిన ఘటనపై కేంద్రమంత్రి అమిత్ షా స్పందించారు. భారత్‌ను నక్సల్ రహిత దేశంగా మార్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో ఇది మరో పెద్ద విజయమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు.

"అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నా కొందరు నక్సలైట్లు లొంగిపోవడం లేదు. అలాంటి వారి పట్ల మోదీ సర్కార్ కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈనాడు మన సైనికులు 'నక్సల్ ముక్త్ భారత్ అభియాన్' దిశలో మరో పెద్ద విజయాన్ని సాధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకెర్‌లలో మన భద్రతా దళాలు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 22 మంది నక్సలైట్లు హతమయ్యారు. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుంది" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా అమిత్ షా పేర్కొన్నారు.

కాగా.. ఒకే రోజు బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ కాల్పుల్లో 22 మంది నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఎదురు కాల్పుల్లో ఓ జవాను అమరుడయ్యారు. ఈ విషయాన్ని అధికారులు వెల్లడించారు.

బీజాపూర్ - దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రి అడవుల్లో నక్సల్స్ నక్కినట్లు నిఘా సమాచారం వచ్చింది. దీంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురు కాల్పులు జరిగాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.

# గ్లాసు నీటి విషయంలో గొడవ..

## కేంద్ర మంత్రి మేనల్లుడి హత్య



**దిల్లీ:** కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన ఇద్దరు మేనల్లుళ్ల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బిహార్‌లోని భాగల్‌పుర్‌కు చెందిన జగత్‌పుర్ గ్రామంలో వారి నివాసంలో గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. తాగునీటి విషయమై ఇరువురి మధ్య వివాదం చెలరేగి, అదికాస్తా ఒకరి హత్యకు దారితీసిందని తెలిపాయి. "జగత్‌పుర్ గ్రామంలో ఇద్దరు సోదరుల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయని మాకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వారిలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. వారి గొడవను ఆపేందుకు మధ్యలో వారి తల్లి వచ్చినట్లు తెలుస్తోంది. ఆమెకు బుల్లెట్ గాయం అయింది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది" అని పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు. కేంద్ర మంత్రి నిత్యానందరాయ్‌కు బావ అయిన రఘునందన్ యాదవ్‌కు ఇద్దరు కుమారులు. వారు జైజిత్ యాదవ్, విశ్వజిత్ యాదవ్. వారింట్లో పనిచేసే సహాయకుడు సర్వ్ చేస్తోన్న సమయంలో తన చేతిని గ్లాసులో ముంచడమే వీరి గొడవకు కారణమని తెలుస్తోంది. ఆ గొడవ పెరిగి ఇద్దరుకాల్పులు చేసుకోగా.. విశ్వజిత్ ప్రాణాలు కోల్పోయాడు. ఎప్పటినుంచో ఈ అన్నదమ్ముల మధ్య సంబంధాలు సరిగా లేవని సమాచారం.

# కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి విశాఖ సమస్యలు



**న్యూఢిల్లీ, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నంలో కనెక్టివిటీని పెంచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం లక్ష్యంగా కీలకమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై చర్చించడానికి ఎంపీ శ్రీభరత్ న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రి నితిన్ గడ్కరీతో గురువారం సమావేశమయ్యారు. విశాఖపట్నం నగరం వేగంగా అభివృద్ధి చెందడం, పెరుగుతున్న వాహనాల రాకపోకలను పరిగణనలోకి తీసుకుని, ట్రాఫిక్ రద్దీని తగ్గించాల్సిన తక్షణ అవసరాన్ని ఎంపీ ప్రస్తావించారు. కీలకమైన విమానయాన కేంద్రంగా మారనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కనెక్టివిటీ ప్రాముఖ్యతను కేంద్ర మంత్రి కి తెలియజేశారు. ఆనందపురం జంక్షన్ వద్ద ఎన్ హెచ్ 16 లోకి ప్రవేశ ర్యాంప్‌ను పునఃరూపకల్పన చేయాలని, ప్రస్తుత డిజైన్ గణనీయమైన ట్రాఫిక్ అడ్డంకులకు కారణమవుతోందని, ప్రణాళికాబద్ధమైన పునఃరూపకల్పన ట్రాఫిక్ అంతరాయాలను తగ్గిస్తుందని ఎంపీ పేర్కొన్నారు.

ప్రస్తుతం డి పి ఆర్ దశలో ఉన్న వైజాగ్-ఖరగ్‌పూర్ బీచ్ కారిడార్ ప్రాజెక్టుకు సంబంధించి చర్చలు జరిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు లక్ష్యం తీరప్రాంత కనెక్టివిటీని పెంచడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడ, తూర్పు తీరప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలను మెరుగుపరచడం అని, అందుకు తగిన మార్పులను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని ఎంపీ శ్రీభరత్ తెలిపారు.

# నెల రోజుల్లో గ్రూప్-2, 3 నియామకాలు పూర్తి

## - తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్:** సీఎం పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటిసారిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ఆయన పాల్గొని 'బిల్డ్ నౌ పోర్టల్'ను ప్రారంభించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య నియామకాలకు సంబంధించి 922 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. "కారుణ్య నియామకాలు మీ హక్కు. గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టక పోవడం వల్ల మీరు పదేళ్లు నష్టపోయారు. జాబ్ క్యాలెండర్‌తో పాటుగా కారుణ్య నియామకాలు కూడా ఇవ్వాల్సిందే. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిది. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల కల నెరవేరలేదు. పేదలు, బడుగుబలహీన వర్గాలవారే పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు. నిరుద్యోగుల బాధలను ప్రజా ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే భారాస ఓడిపోయింది. మాకు ఉద్యోగాలు ఇవ్వని మీకు ఉద్యోగాలు ఎందుకని నిరుద్యోగులు భారాసను ఓడించారు.



కారుణ్య నియామకాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదు. నిరుద్యోగుల బాధలు నాకు తెలుసు. ఉద్యోగ ఖాళీలను పెండింగ్ పెట్టొద్దని ఆదేశాలిచ్చా. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు ఇచ్చాం. 30, 40 రోజుల్లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం. ఉద్యోగాలు ఇచ్చినా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# విశాఖపట్నం, తిరుపతిలో సినీ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు : మంత్రి దుర్గేశ్

**అమరావతి :** విశాఖపట్నం, తిరుపతిలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి త్వరలో కొత్త పాలసీ తీసుకు రాబోతున్నట్టు చెప్పారు. సినీ ప్రముఖులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విశాఖపట్నంలో సినీపరిశ్రమ అభివృద్ధి, గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధిపై మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

విశాఖలో చలన చిత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న మంత్రి... కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు,



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో చర్చించారని, హైదరాబాద్ తరహాలో స్టూడియోలను రాష్ట్రంలో ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఏపీ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అద్భుతమైన లొకేషన్లు ఉన్నాయని, స్టూడియోలు నిర్మిస్తే ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని నిర్మాతలను చెప్పినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం ద్వారా లేక పీపీపీ మోడ్‌లో స్టూడియోల నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు.

విశాఖలో రామానాయుడు స్టూడియోకు గతంలో 34 ఎకరాలు కేటాయించగా.. గత ప్రభుత్వం ఇందులో 15 ఎకరాలు లేఅవుట్లు వేసి ఇతర అవసరాలకు మళ్లించిందన్నారు. రాబోయే రోజుల్లో 34 ఎకరాలను సినీ పరిశ్రమకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి 1/70 చట్టాన్ని సవరించే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, గిరిజనుల భాగస్వామ్యంతో పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో పలువురు సినీ ప్రముఖులు!

(మొదటి పేజీ తరువాయి)

నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణు ప్రియ, హర్ష సాయి, బయ్యా సన్నీ యాదవ్, యాంకర్ శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత ఉన్నారు. మియాపూర్ వాసి ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్లు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ కాల్పుల్లో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతంలో 22 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక, ఇదే సమయంలో కాంకెర్ జిల్లాలోనూ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇక్కడ డీఆర్‌జీ, బీఎస్ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. రెండు జిల్లాల్లోనూ ప్రస్తుతం యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ కొనసాగుతోంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# దొంగచాటు సంతకాలు చేసి సభకు డుమ్మానా?

(మొదటి పేజీ తరువాయి)

విరూపాక్ష, విశ్వేశ్వరరాజు, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, దాసరి సుధ తదితరులు సంతకాలు చేసినట్లు తేలిందని స్పీకర్ చెప్పారు. గవర్నర్ ప్రసంగం తర్వాత వీరెవరూ సభకు హాజరు కాలేదన్నారు. వేర్వేరు తేదీల్లో వీరు రిజిస్టర్‌లో సంతకాలు చేసినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. హాజరుపట్టీలో వారి సంతకాలు ఉన్నా వాళ్లు సభకు వచ్చినట్టు స్పీకర్‌గా తాను గుర్తించలేదన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు తలవంపులు తేవొద్దంటూ అయ్యన్న వ్యాఖ్యానించారు.

# ఏపీలో కొత్త ఆవిష్కరణలకు కృషి: బిల్ గేట్స్

**అమరావతి:** ఏపీ ప్రభుత్వంతో ఒప్పందాలపై మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్రంలో ఆరోగ్యం, వ్యవసాయం, విద్యా రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు అందించాలని ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం దిల్లీలో బిల్ గేట్స్‌తో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి సంబంధించి గేట్స్ ఫౌండేషన్‌తో పలు ఒప్పందాలు చేసుకున్నారు.

# ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

మాపడానికి ఎన్నో జీవోలు జారీ చేశాం. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ సెల్ ఏర్పాటు చేశాం. హోటళ్లు, మంచినీటి బావుల వద్ద వివక్ష పాటించకుండా చట్టపరంగా చర్యలు తీసుకున్నాం. సాంఘిక సమానత్వంపై ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహించాం

**ఆ ఘనత తెదేపాదే ..**

లోక్‌సభ స్పీకర్‌గా ఒక దళితుడిని చేసిన పార్టీ తెలుగుదేశం. స్పీకర్‌గా బాలయోగి ఎంతో బాగా రాణించారు. దళిత మహిళ ప్రతిభా భారతిని స్పీకర్ చేసిన ఘనత కూడా తెలుగుదేశానిదే. ఎస్సీ అయిన కాకి మాధవరావును రాష్ట్ర సీఎస్‌గా చేసింది తెదేపానే. నేను యునైటెడ్ ఫ్రంట్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఎస్సీ అయిన కేఆర్ నారాయణన్‌ను రాష్ట్రపతిని చేశాం. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా ఎస్సీ, ఎస్టీలకు కీలక పదవులు ఇచ్చింది. గతంలో ఎస్సీ అయిన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేశారు. ఇప్పుడు ఎస్టీ అయిన ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిగా చేసింది. ఎస్సీ కోసం రూ.8,400 కోట్లతో ఆర్థిక చేయూత పథకాలు తీసుకువచ్చాం. గతంలోనూ మాల, మాదిగ సామాజిక వర్గాలకు దామాషా ప్రకారం నిధులు కేటాయించాం. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నా. నా రాజకీయ జీవితమంతా పేదలకు న్యాయం చేసేందుకే కృషి చేశాను. ఎస్సీ వర్గీకరణ అంశంలో మాకు సహకరించిన పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నా" అనే ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**ఈ నెలలో పీ4 విధానం**

" రాష్ట్రంలో మౌలిక వసతులు పెంచేందుకు గతంలో పీపీపీ విధానం తీసుకువచ్చాను. కొత్తగా ఈ నెలలో పీ4 విధానం తీసుకురానున్నాం. ఆర్థికంగా బాగున్న వారు సమాజానికి ఎంతోకొంత తోడ్పాటునందించాలి. పేదరికంలో ఉన్న 30లక్షల కుటుంబాలను దత్తత తీసుకునే ఏర్పాట్లు చేస్తాం"అని సీఎం చంద్రబాబు అన్నారు.

# అనకాపల్లికి అణు'భయం'?

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. దేశవ్యాప్తంగా 23 ప్రాంతాలు అనువైనవిగా గుర్తించింది. రోజురోజుకూ బొగ్గు లభ్యత తగ్గిపోవడంతో పాటు సోలార్, విండ్ నుంచి కచ్చితంగా ఇంత మొత్తం విద్యుత్ వచ్చే అవకాశముందని చెప్పే వీల్లేకపోవడంతో దేశ విద్యుత్ అవసరాలను తీర్చేందుకుగానూ అణు విద్యుత్ వైపు ఎన్టీపీసీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఒక్కొక్కటి 700 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు ప్లాంట్లు ఏర్పాటుచేసేందుకు అవకాశముందని ఎన్టీపీసీ భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పక్కనున్న తెలంగాణలో కూడా ఒక అణు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుచేయాలని ఎన్టీపీసీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ప్లాంటు ఏర్పాటుకు అనువైన ప్రాంతం ఏదీ అనే విషయంపై మాత్రం ఇంకా స్పష్టతరాలేదు. . అణు విద్యుత్ ప్లాంట్‌కు భారీగా నీటి లభ్యత అవసరం ఉంటుందని.. ఈ అవసరాలను పోలవరం ద్వారా తీర్చుకునే వెసులుబాటు ఉందని కూడా ఎన్టీపీసీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**అణు ధార్మికత ముప్పుపై ఆందోళన..**

ఇక అణు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై మొదటి నుంచీ ఆందోళన ఉంది. ఈ ప్లాంటు ఏర్పాటైతే తమ భూములను కోల్పోవడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తి, ప్రాణాలకు ముప్పు తప్పదన్న అభిప్రాయాలున్నాయి. దీన్నుంచి వచ్చే అణు ధార్మికతవల్ల ప్రధానంగా క్యాన్సర్‌తో పాటు ఎక్యూట్ రేడియేషన్ సిండ్రోమ్, ఎనీమియా వంటి జబ్బులతో ప్రాణాల మీదకు వస్తుందన్న భయాందోళనలు ఉన్నాయి. మరోవైపు.. 1986లో ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్‌లో జరిగిన సంఘటనతో పాటు 2011 జపాన్‌లో జరిగిన అణు విద్యుత్ ప్లాంటు దుర్ఘటనలవల్ల చోటుచేసుకున్న నష్టాన్ని ప్రజలు గుర్తుతెచ్చుకుంటున్నారు.

# విశాఖ క్రికెట్ స్టేడియానికి వైఎస్సార్ పేరు ఉండాల్సిందే ..

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు అనుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు సీఎంగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలకు గుర్తుగా పీఎంపాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి ఆయన పేరు పెడుతూ 2009లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ గవర్నింగ్ బాడీ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంగానే ఇక్కడ అనేక అంతర్జాతీయ, జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. స్టేడియంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈ పదినెలల్లోనే రాష్ట్రంలో ఎక్కడా వైఎస్ఆర్ అనే పేరు లేకుండా చేయాలనే కుట్రతో దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. దానిలో భాగంగానే 2024 జూన్ లో అధికారంలోకి రాగానే ఏఎన్‌యులో ఉన్న వైఎస్ విగ్రహాన్ని తొలగించారు. బాపట్లలో ఆయన విగ్రహానికి నిప్పు పెట్టారు. సీతకొండ వద్ద వ్యూపాయింట్‌కు వైఎస్ఆర్ పేరు పెడితే దానిని ధ్వంసం చేశారు. రైతుభరోసా కేంద్రాలు, ఆరోగ్యశ్రీ పథకాలకు వైఎస్ఆర్ పేరును తొలగించారు. ఇప్పుడు విశాఖ అంతర్జాతీయ స్టేడియానికి ఉన్న వైఎస్ఆర్ పేరును కూడా తీసేసేందుకు కుట్ర చేస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో అందోళనలు చేయకుండా సంయమనం పాటిస్తున్నాం. స్టేడియం వద్ద నిరసనలు తెలియచేస్తామని చెప్పడంతో మాపార్టీ నేతలు, కార్యకర్తలను పోలీసులు గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. అర్ధరాత్రి సమయాల్లో నేతల ఇళ్లకు వెళ్లి పోలీసులు హంగామా సృష్టించడం దారుణం" అని అమర్నాథ్ పేర్కొన్నారు.

**టీడీపీ ఎంపీల వత్తిడితోనే...**

స్టేడియంలో నూతనంగా నిర్మించిన ఆర్చీ, స్టేడియానికి చెందిన ఫసాట్‌లలో వైఎస్ఆర్ పేరు లేకుండా చేశారు. ఆయన పేరును ఎందుకు పెట్టలేదో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వివరణ ఇవ్వాలి. ప్రస్తుతం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లోని రెండు కీలక పదవుల్లో టీడీపీకి చెందిన ఎంపీలు ఉన్నందునే ఈ దుర్మార్గానికి ఒడిగట్టారా? బీసీసీఐ నిబంధనల ప్రకారం రాజకీయ



పదవుల్లో ఉన్నవారు క్రికెట్ అసోసియేషన్‌లకు బాధ్యత వహించకూడదు. దానిని కూడా ఉల్లంఘించి, టీడీపీ ఎంపీలు ఏసీఏను కైవశం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్ పేరును చూస్తేనే ఉలిక్కిపడుతోంది. వైఎస్ సీఎంగా పనిచేసిన సమయంలో విశాఖపట్నాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. అని అమర్ గుర్తుచేశారు. జగన్ సీఎంగా ఉన్నపుడు ఎన్టీఆర్ పేరును కొత్తగా కృష్ణాజిల్లా నుంచి ఏర్పాటైన జిల్లాకు పెట్టారు. నాలుగుసార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఏనాడైనా ఎన్టీఆర్ పేరును ఒక జిల్లాకు పెట్టాలని ఆలోచన చేశారా? కనీసం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కూడా ఏనాడు కోరుకోలేదని పేర్కొన్నారు.

# ఏపీలో 16,862 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు హోంమంత్రి సమాధానం ఇచ్చారు. పదోన్నతులు ఇవ్వకపోవడానికి కారణం హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం సీనియారిటీ జాబితా సవరించడమే అన్నారు. 2017లో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2018లో సీనియారిటీ జాబితాను ప్రభుత్వం జారీ చేసింది. ఇచ్చిన సీనియారిటీ లిస్టులో 1995 బ్యాచ్‌కు చెందిన డీఎస్పీ వెంకటేశ్వర్లు.. సీనియారిటీని నిర్ణయించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ వివాదం కోర్టులో ఉండడం వల్ల ప్రమోషన్లకు ఇబ్బంది ఉంది. సూపర్ న్యూమరీ పోస్టుల ద్వారా వారికి ప్రమోషన్లు కల్పించాం. దీనివల్ల సీఐ, ఎస్సై పోస్టుల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. తెలంగాణలో కోర్టు ఇష్యు లేకపోవడం వల్లే ప్రమోషన్లు కొత్త పోస్టులు కల్పిస్తే ఏడాదికి ఒక్కో వ్యక్తికి రూ.11,75,325 ఆర్థిక భారం పడుతుంది. ఏడాదికి ప్రభుత్వం పై మొత్తం రూ.101,31,30,150 భారం పడుతుంది. ప్రభుత్వం పై ఆర్థిక భారం పడినా కూడా త్వరలోనే సాంకేతిక అడ్డంకులను తొలగించి ప్రమోషన్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హోం మంత్రి అనిత చెప్పారు. ఇప్పటివరకు 862 మంది పోలీస్ ఇన్ స్పెక్టర్లు (సివిల్) 6 సంవత్సరాల సర్వీసు పూర్తి చేశారు. 1995 బ్యాచ్ కు చెందిన 65 మంది ప్రమోషన్ల విషయంలో ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ వారు కోర్టును ఆశ్రయించడం వల్ల ఆలస్యమైంది. త్వరలోనే కోర్టు అనుమతితో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఒక కమిటీ ఏర్పాటు చేసి.. సమస్యకు పరిష్కారం తీసుకొస్తామని హోం మంత్రి వెల్లడించారు.

# భారత ప్రభుత్వంపై మస్క్ 'ఎక్స్' దావా

(మొదటి పేజీ తరువాయి)

చేసే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదని ఎక్స్ వాదిస్తోంది. సెక్షన్ 69ఏని పక్కదారి పట్టించడానికి అధికారులు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. దేశంలో అల్లర్లు, ఘర్షణలకు కారణమయ్యే పోస్టులు, పూర్తి వివరాలు లేకుండా సృష్టించిన ఖాతాలపై నియంత్రణ విధించేందుకు సెక్షన్ 69-ఏ ప్రకారం కేంద్రానికి అధికారం ఉంటుంది. అదేసమయంలో సెక్షన్ 79(3)(బి) స్పష్టమైన నియమాలు, తనిఖీలు లేకుండా అధికారులు సమాచారాన్ని బ్లాక్ చేయడానికి అధికారులు అనుమతి ఇస్తున్నారని తన పిటిషన్‌లో ప్రస్తావించిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇది విస్తృతమైన సెన్సార్‌షిప్‌నకు దారితీస్తోందని విమర్శలు చేసింది. ఈ దావాపై కేంద్ర ప్రభుత్వవర్గాల నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వం చట్టాన్ని అనుసరించి ముందుకెళ్తుందని, సోషల్ మీడియా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందేనని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

## రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

రోజు ఏపీ అసెంబ్లీతో పాటు శాసన మండలిలోనూ ఎస్సీ వర్గీరణ బిల్లును ప్రవేశ పెట్టారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఈ బిల్లును ప్రవేశ పెట్టారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో తెలుగుదేశంతో పాటు జనసేన మద్దతు తెలిపింది. ఎస్సీ వర్గీకరణ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబుతో సహా పలువురు సభ్యులు మాట్లాడారు. అనంతరం ఉభయసభలను నిరవధికంగా వాయిదా వేస్తూ అసెంబ్లీలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రకటన చేశారు.

# ఆరు తాగునీటి బోర్లు మంజూరు



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- బుచ్చయ్యపేట పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే రాజు ఆశీస్సులతో స్థానిక సర్పంచ్ లక్ష్మి, స్థానిక ఎంపీటీసీ వెంకటరమణ, సీనియర్ నాయకులు డొంకిన అప్పలనాయుడు అభ్యర్థన మేరకు మండల పరిస్థితి నిధుల నుండి 6 బోర్లు విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరావు దేవి, 6 బోర్లు మంజూరు చేశారు. విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ నాగేశ్వర దేవి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి గోకవాడ కోటేశ్వరరావు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, మండల బిజెపి అధ్యక్షులు సీత నాగరాజు, కోవెలాపల్లి ఎంపీటీసీ సీత సన్యాసినాయుడు, స్థానిక మాజీ ఎంపీటీసీ పాతాళ శ్రీను, పూడి రామారావు, గంధం చిరంజీవి, డొంకిన చిరంజీవి, శనివాడ శ్రీను, తాటికొండ కాంతారావు, పాల సంఘం అధ్యక్షులు సుంకర బాబ్జి, మరియు గ్రామ ఓటమి నాయకులు, కెపి అగ్రహారం టిడిపి సీనియర్ నాయకులు అడ్డూరి శ్రీను, ఐతంపూడి పాల సెక్రెటరీ శ్రీను, మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):- అనకాపల్లి పట్టణం జీవీఎంసీలో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాచురల్ ఫార్మింగ్ లో పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు, ఆకుకూరలు స్టాల్ ను గురువారం జిల్లా పకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ లచ్చన్న ప్రారంభించారు. ఈ వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను వినియోగించడం వల్ల ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా, బీపీ, షుగరు, గుండుపోటు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది అందరూ కూడా కూరగాయలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి వర్మ, జిల్లా కోఆర్డినేటర్ గోవింద్, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ అప్పలరాజు, మోడల్ మేకర్స్, పకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ సీఈవో విస్తృత పర్యటన

### అభివృద్ధి పనుల తనిఖీ, సచివాలయ ఉద్యోగులతో రివ్యూ



కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, అలాగే పి ఫోర్ వర్క్ ఫ్రం హెూం, ఎన్పీసీఐ, సిటిజన్ కేవైసీ సకాలంలో పూర్తి చేయించాలని ఎంపీడీవో ఎస్ కే వి ప్రసాద్ ను జిల్లా పరిషత్ చైర్మన్ పి నారాయణమూర్తి ఆదేశించారు. గురువారం మండలంలో కొయ్యూరు రాజేంద్రపాలెం పంచాయతీలో ఎంపీపీ బడుగు రమేష్,ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్ తో కలిసి అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. కొయ్యూరు గ్రామానికి వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని రాజేంద్రపాలెంలో గ్రావిటీ ద్వారా వచ్చే నీటిని ఆ గ్రామ ప్రజలతో మాట్లాడి గ్రామ మంచినీటి అవసరాలు పోను మిగిలిన నీటిని కొయ్యూరు గ్రామ నీటి అవసరాలకు నియమించేలాగా తగు ఏర్పాటు చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. సింగవరం జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని సందర్శించి అతిథి గృహానికి మరమ్మతులకు తగిన అంచనా 20 లక్షల రూపాయలు జిల్లా పరిషత్ నిధులతో నాణ్యతతో సుందరంగా తయారు చేయాలని పంచాయతీరాజ్ ఏఈ ని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగులను వివరాలడిగి రికార్డులు తనిఖీ చేశారు. ప్రభుత్వానికి సంబంధించి ప్రతి ఒక్క కార్యక్రమం టైం ప్రకారం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ నుండి నిధులు ఇచ్చినందుకు జడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు అంతా కలిసి సీఈవో ను దుశాలవతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ కే వి ప్రసాద్, ఈవో పి ఆర్ డి నాయుడు, ఇతర అధికారులు రాజేంద్రపాలెం సర్పంచ్ పీ ట సింహాచలం తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆస్తిపన్ను బకాయిలపై స్పెషల్ డ్రైవ్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- జీవీఎంసీ గాజువాక జోన్ -6 పన్ను వసూళ్లలో భాగంగా జోనల్ కమీషనర్ బుద్ధ రామ శేషాద్రి, అసిస్టెంట్ కమీషనర్ సి.హెచ్.రామనారాయణ, రెవిన్యూ ఆఫీసర్ ఎమ్. శ్రీకాంత్, ఆర్.ఇ రెడ్డి మోహన్, మరియు అడ్మిన్స్ ఆధ్వర్యంలో గాజువాక బీ.సి రోడ్ నందు ఆస్తి పన్ను బకాయిదారులతో మాట్లాడటం జరిగింది, అలాగే అండర్ కన్స్ట్రక్షన్స్ అపార్ట్మెంట్లు పరిశీలించి వారి చేత ఖాళీ జాగా పన్ను కట్టించడం జరిగింది.

జోన్ -6 లో ఇంటి పన్ను బకాయి ఉండటం వలన 63వ వార్డ్ లో బి.సి రోడ్డు ప్రాంతంలో పన్ను బకాయిదారుల ఇంటి కొళాయి డిస్కనెక్షన్ చేయబడినది. ఎస్. శాంత రావు 1,16,212/- రూపాయలు.

ఆర్య వైశ్య గురుమూర్తి వాసవి కళ్యాణమండపంవారు, మెహర్ నగర లో ఆస్తి పన్ను 7,07,084/- చెల్లించకుండా ఉండటం చేత జప్తు నోటీస్ ఇవ్వడం జరిగింది, బకాయిదారుల సాయంత్రం లోపు పన్ను చేల్లిస్తాం అని హామీ ఇవ్వడం జరిగింది.

జోనల్ కమిషనర్ కమిషనర్ బుద్ధ రామ శేషాద్రి, అసిస్టెంట్ కమీషనర్ సి.హెచ్.రామనారాయణ, రెవిన్యూ ఆఫీసర్ ఎమ్. శ్రీకాంత్, ఆర్.ఇ రెడ్డి మోహన్ మాట్లాడుతూ గాజువాక జోన్ -6 పురప్రజలు పన్ను బకాయి దారులు త్వరతగతిన ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లించవలసిందిగా కోరారు.

# ఆశీలు వసూలుకు వేలం పాట



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- జోనల్ కమిషనర్ ఎం మల్లయ్య నాయుడు ఆధ్వర్యంలో జోన్ -4 పరిధిలో ఉన్న మార్కెట్లు అయినా పూర్ణ మార్కెట్, రామకృష్ణ రైతు బజార్ మార్కెట్ ఆసీలు వసూలు చేసే నిమిత్తం సంవత్సర కాలానికి అనగా ఏప్రిల్ 2025 నుండి 2026 మార్చ్ నెల వరకు సంవత్సర కాలానికి వేలంపాట నిర్వహించడం జరిగింది. పూర్ణ మార్కెట్ ఆశీలు వసూలు నిమిత్తం 81,10,000/- శ్రీ బొత్స శీను, రామకృష్ణ రైతు బజార్ మార్కెట్ 19,50,000/- శ్రీ ఎస్ విజయ్ కుమార్ గారు పాడడం జరిగింది.

ఈ వేలంపాటలో రెవిన్యూ ఆఫీసర్ అప్పలరాజు గారు, జోనల్ సూపరెంటెంట్ చంద్రశేఖర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సీతారాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఫలించిన దండోరా ఉద్యమ పోరాటం

### జయహెూ..మాదిగ మహాత్ముడు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిగా, ఎస్ సి రిజర్వేషన్లలో దళితుల మధ్య సమాన ప్రాతినిధ్యం కోరుతూ 1994 జూలై 7 మంద కృష్ణ మాదిగ సారధ్యం లో తెలుగు నేల పై ఆవిర్భవించిన ఆత్మ గౌరవ దళిత ఉద్యమం ఇది. ప్రకాశం జిల్లా ఈదుమూడి అనే చిన్న పల్లెలో 10 మంది యువకులతో ఈ ఉద్యమం పురుడు పోసుకుంది. ఎం ఆర్ పి ఎస్ లేదా మాదిగ దండోరా ఉద్యమం పేరు తెలియని వారు రెండు తెలుగు రాష్ట్రాల్లో లేరంటే అతిశయోక్తి కాదు. ఆంధ్ర ప్రదేశ్ లో పురుడు పోసుకున్న ఈ ఉద్యమం కాల క్రమేణా దినదినాభివృద్ధి చెందుతూ తన పరిధిని విస్తరించుకుంటూ దేశంలోని వివిధ రాష్ట్రాలకు పాకింది . ఎందరినో ఉద్యమం పథం లోకి దింపింది. ప్రపంచ స్థాయి ఉద్యమంగా మారింది. రిజర్వేషన్లలో సమాన వాటా కోసం సమరశంఖం పూరించింది ఈ ఎమ్మార్పీఎస్ ఉద్యమం.

దళితుల మధ్య రిజర్వేషన్ ఫలాల సమ పంపిణీ కి సంబంధించిన ఈ అంశం అన్ని రాజకీయ పార్టీల మద్దత్తు కూడగట్టింది కానీ, దళితుల్లో అప్పటిదాకా ఎక్కువ మొత్తం లో రిజర్వేషన్ల ఫలాలను అనుభవిస్తున్న సోదర వర్గం నుండి మాత్రం ప్రతిఘటన ఎదుర్కొంది. అనేక అధ్య యనాలు, పరిశీలన లు జరిగిన తరువాత "వర్గీకరణమే " న్యాయం అని నివేదికలు రావడం దండోరా ఉద్యమానికి నైతిక బలాన్ని పెంచింది . ఈ ఉద్యమం లక్షలాదిమంది మాదిగలకు మను ష్యులుగా గుర్తింపును, గౌరవాన్ని హుందాతనాన్ని తెచ్చిపెట్టింది. లక్షలాది మంది మాదిగలను సమీ కరించి మహాసభలు, నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తా రోకోలు, ఘోరావ్ లు, బ్లాక్ డే లు జరిపి కుంభకర్ణుడి నిద్ర నటిస్తున్న ప్రభుత్వాధిపతులను మాదిగల డిమాండ్ ను గుర్తించేలా చేయగలిగింది . మాదిగల్లో ఐక్యతని, ఆత్మవిశ్వాసాన్ని, హక్కుల పట్ల గొప్ప చైతన్యాన్ని కలిగించింది.

"మేకల్ని బలి ఇస్తారు.. పులుల్ని కాదు. మేకల్లా కాకుండా పులుల్లా బతకండి" అన్న అంబేద్కర్ ఉద్బోధ లోంచి, "హక్కుల కోసం బిచ్చమెత్తకండి పోరాడి సాధించుకోండి" అన్న బాబూ జగ్జీవన్ రాం పిలుపు లోంచి, " పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్ప" అన్న కార్ల మార్క్ మాట నుండి, "హక్కుల కోసమే తప్ప ఎవ్వరి మీదా మాకూ ద్వేషం లేదు" అన్న అబ్రహం లింకన్ మనోసరస్సు నుండి, బుద్ధుని అష్టాంగ మార్గం నుంచి, క్రీస్తు ప్రేమ సందేశం నుంచి అన్నింటికీ మించి నిజ జీవితంలో అనుభవిస్తున్న అంటరాని తనం ఆకలి మంటలలోంచి మనుషులుగా గుర్తిం పుకోసం మానవ హుందాతనం కోసం కనీస హక్కుల సాధన కోసం సమాజం అట్టడుగు పొరల్లో విరిగి నలిగిన లక్షలాది మంది మాదిగల కోసం ముఖ్యంగా మాదిగ అస్తిత్వం కోసమే పుట్టింది "దండోరా" ఉద్యమం. సమాజంలో తన కులం పేరు చెప్పుకోవడానికి భయపడిన మాది గోడు దండోరా రగిల్చిన ఉద్యమం స్ఫూర్తితో తమ పేరు చివర తన కులం పేరును గర్వంగా ఉంచ గలిగాడు. జనాభా దామాషా ప్రకారం హక్కులు న్యాయం గుర్తింపు ప్రతి సాంఘిక సమూహానికి కావాలని అణగారిన కులాలు జాతులకు మేలుకొలుపు బృంద గీతిక అయ్యింది దండోరా ఉద్యమం.






కేంద్ర సర్వీసులలోను, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలోను, నియామకాల్లో మాలలకు 80% ఉద్యోగాలిస్తూ ఉంటే మాదిగలకు 20% ఉద్యో గాలు మాత్రమే దక్కడం . రాజకీయ పార్టీలు కూడా తమ ప్రతినిధులుగా మాలలకే ఎక్కువ సీట్లు కేటాయించడం జరిగిన దరిమిలా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో %బాజ% రిజర్వ్ సీట్లు 40కు పైగా ఉంటే పది సీట్లు మాత్రమే మాదిగ %మీూూ% లు ఉండడం, ఆనాటికి ఉన్న ఆరు పార్లమెంట్ రిజర్వుడు సీట్లలో 5 మాల ప్రతినిధులు ఉండడం, కేంద్ర రాష్ట్ర మంత్రులలో కూడా అధిక భాగం మాల వారికే దక్కడం ఇలాంటి ఎన్నో ఎన్నో సంఘటనలు ఈ దండోరా ఉద్యమానికి పుట్టుకకు కారణాలుగా చెప్పుకోవచ్చు . ఉద్యోగస్థులలో ఐతే మాదిగలు చాలా వెనుకబడి ఉన్నారు. నిరుద్యోగుల సంఖ్య అయితే గణనీయంగా పెరుగుతూ మాదిగ యువకులను అతివాద ఉద్యమాలు తీవ్రంగా ఆకర్షించ సాగాయి. ఈ వెనుకబాటు తనమే మాదిగలను సమాజంలో తన స్థానము ఏమిటో అనేది గుర్తించడానికి కారణ భూతమైనది.

కారణాలు అన్నిటి వలన మాదిగలు ఆత్మగౌరవం కొరకు పోరాటం మొదలు అయింది. మానవ హక్కుల కోసం ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసం కొంచెం ఆలస్యంగా అయిన మాదిగలు నడుంబిగించారు. మానవహక్కుల పోరాట పరిరక్షణ దిశలో ఆత్మ రక్షణ నుండి, ఆత్మగౌరవం కోసం వచ్చిన చైతన్యమే దండోరా ఉద్యమం. ఈ ఉద్యమం 1994 లో అస్తిత్వ గౌరవం సమాన అభివృద్ధి, సమాన అవకాశాలు అనే బాగా వెనుకబడిన షెడ్యూల్ కులాలు నుండి వచ్చిన ఆలోచన. ఈ కారణాల వలన మాదిగ కార్యాచరణ ప్రణాళికగా దండోరా ఉద్యమం ఆవిర్భవించింది. దండోరా ఉద్యమం లేకపోతే ఈ రోజుకీ సమాజములో మాదిగల స్థాయి దిగజారి ఉండేది. దండోరా పుణ్యమా అని రాజకీయ పార్టీలలో పదవులు పొంది ఉద్యమాన్ని హేళన చేస్తున్నారు కొందరు మాదిగ నాయకులు. ప్రతి ఒక్కరు దండోరా పూర్వము మాదిగల చరిత్ర, దండోరా తరువాత మాదిగల చరిత్ర తెలుసుకుని విమర్శలు చేయాలా వద్దా అని పునః పరిశీలించు కోవడం ఆవశ్యకం. లేదంటే ఉద్యమ చరిత్రలో హీనులుగా మిగలడం తథ్యం.

2000 లో సాధించిన వర్గీకరణ ఫలితం గా ఎస్సి లలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగలు వర్గీకరణ ఫలితంగా అనేక మేలులు పొందారు . 2004 నవంబర్ 5 న సుప్రీం కోర్టు ఎస్సి వర్గీకరణ చట్టాన్ని కొన్ని సాంకేతిక కారణాలు చూపెడుతూ రద్దు చేసింది. వర్గీకరణ కోల్పోయాక మాదిగ ఉద్యమ ప్రయాణం పొగడ్తలూ సంపాదించింది , విమర్శలకు లోనైంది . ఆరోగ్యశ్రీ, వృద్ధులు వితంతువుల వికలాంగుల పెన్షన్ వంటి పథకాల రూపకల్పనకు ఎమ్మార్పీఎస్ పోరాటమే భూమిక . 2007 లో కేంద్ర ప్రభుత్వం ఎస్సి ల రిజర్వేషన్ వర్గీకరణ అంశం పై ఉషా మెహ్రా కమిషన్ ను ఏర్పాటుచేసింది. 2008 లో ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించి ఎస్ సి వర్గీకరణ ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని తన నివేదికలో వెల్లడించింది. అయిన పాలక పక్షాలు మాదిగల పై తన సవతి ప్రేమను చూపుతూ, ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తమ రాజకీయాలకు వాడుకుంటూ పబ్బం గడుపుతున్నాయి. 30 సంవత్సరాలకు పైగా తమ లక్ష్యం - ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ సాధించి తీరాలని తమ ఆశయ సాధన కోసం మాదిగ మహాత్ముడు, ఉద్యమ సూర్యుడు మందా కృష్ణ మాదిగ నేతృత్వం లో ఈ ఉద్యమం నడిచింది. తమ న్యాయమైన హక్కును సాధించే క్రమంలో ఎం ఆర్ పి ఎస్ ఉద్యమం, ఉద్యమ నాయకత్వం ఎన్నో అవమానాలను ఎదుర్కొంది. 2024 లో కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఎస్ సి రిజర్వేషన్ వర్గీకరణ అంశం పై ఆయా రాష్ట్రాలకు అధికారం ఇచ్చేలా సుప్రీం తీర్పుకు లోబడి నేడు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ లో ఎస్ సి రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం మాదిగ జాతి చరిత్రలో సువర్ణ అధ్యాయం కానుంది. ఈ సందర్భంగా మాదిగ దండోరా ఉద్యమ కారులకు అభినందనలు, ఎం ఆర్ పి ఎస్ ఉద్యమ అమర వీరులకు నివాళులు అర్పిస్తూ, వర్గీకరణ బిల్లుకు సహకరించిన ఎన్డీయే నేతలకు ధన్యవాదాలు తెలుపుకుందాం.

డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్ మాదిగ
9490833108.

# ముగిసిన సీఫుడ్ టెక్నాలజిస్ట్, ఎలిసా టెక్నిక్ శిక్షణ తరగతులు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఎక్స్పోర్ట్ ఇన్స్పెక్షన్ ఏజెన్సీ -చెన్నై, సబ్ ఆఫీస్,విశాఖపట్నం ఆఫీస్లో "ఎలిసా టెక్నిక్ ద్వారా మత్స్య ఉత్పత్తుల్లో నిషేధిత యాంటీబయాటిక్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ ఏజెన్సీ ఇన్చార్జ్ జయపాలన్ జి, అసిస్టాట్ డైరెక్టర్ ఇంచార్జ్ సుధాన్సు శేఖర్ దాస్ సమక్షంలో ఇతర అధికారులు మరియు సిబ్బందితో కలిసి వివిధ సాంకేతిక నిపుణులతో 2025 మార్చి 19 న ప్రారంభమై 20 న ముగిసింది. విశాఖపట్నం, భీమ వరం, కాకినాడ ప్రాంతానికి చెందిన సీఫుడ్ ఎగుమతి దారులకు చెందిన సాంకేతిక నిపుణులకు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు.

# కేవీజీబీలో దరఖాస్తుల ఆహ్వానం

### ప్రిన్సిపల్ పరిమళ



కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- కొయ్యూరు కె వి పాఠశాల కాలేజీల్లో 2025-26 సంవత్సరానికి గాను దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పరిమళ తెలిపారు. 6 వ తరగతిలో 40 సీట్లు, 7 వ తరగతిలో 2 సీట్లు,8 వ తరగతిలో 1,9 వ తరగతిలో 1,10 వ తరగతిలో 8 సీట్ల తోపాటు, కాలేజీ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు, ఇంటర్ రెండవ సంవత్సరం ఎంపీసీ 1 సీటు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. తేదీ 22.3.25 నుండి 11.4.25. తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు.

# కొత్త అమావాస్య పండగకు ఏర్పాట్లు



రావికమాతం, (విశాఖ సమాచారమ్):- రానున్న కొత్త అమావాస్య పండగను పురస్కరించుకొనీ గురువారం కొత్తకోట నూకాంబిక అమ్మవారి ఆలయ పరిసరాలను గ్రామ సర్పంచ్ కోన లోవరాజు పరిశీలించారు. జెసిబి మిషనరీతో గుడి పరిసరాల్లో చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పలు సూచనలు ఇచ్చారు.అంతేకాక కొత్తకోట వాస్తవ్యులు భీమరాతి వెంకట్ ఆర్థిక సహాయంతో ఆలయ ప్రాంగణంలో టైల్స్ వేయించే పనికి పలు సూచనలు సంబంధిత వ్యక్తులకు ఇచ్చారు.

# 75 లక్షలతో సబ్ ట్రెజరీ కార్యాలయం



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):- నక్కపల్లిలో సబ్ ట్రెజరీ కార్యాలయానికి రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత రూ.75 లక్షలు మంజూరు చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. సబ్ ట్రెజరీ పాత భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులతో కలిసి పాత భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెదపూడి శంకర్రావు, డీఈ ప్రసాద్ పాల్గొన్నారు.

# గెడ్డం బుజ్జికి జనసేన నాయకుల పరామర్శ



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):- మండల అధ్యక్షులు వెలగా సుధాకర్ రావు ఆసుపత్రి చికిత్స అనంతరం ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర జనసేన పార్టీ సీనియర్ నాయకులు పాయకరావుపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి గెడ్డం బుజ్జి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. బుజ్జి తో పాటు జనసేన పార్టీ సీనియర్ నాయకులు జగ్గన్న దొర,నక్కపల్లి మండలం ఉప అధ్యక్షులు నల్లల రత్నజి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

శుక్రవారం 21-3-2025

## మరో సారి కామన్వెల్త్ క్రీడలు

ఒలింపిక్స్ తరవాత ఎక్కువ దేశాలు బరిలో నిలిచేవి కామన్వెల్త్ క్రీడలు. 2010లో తొలిసారి ఈ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన మన దేశం, మరోసారి నిర్వహించాలనే ఆలోచనలో ఉంది. 2030లో జరిగే క్రీడాపోటీల కోసం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే 2036 ఒలింపిక్స్ ఆతిథ్యంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి తన సన్నద్ధతను తెలిపింది. అంతకన్నా ముందు కామన్వెల్త్ పోటీలను నిర్వహించడం సన్నాహకంగా పని చేస్తుందని భారత్ భావిస్తోంది. ఇండియాలో భారీ క్రీడోత్సవాలను నిర్వహించడం అరుదు. పోటీల నిర్వహణ అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. అంతేకాకుండా మన దేశంలో క్రీడా వసతులూ తక్కువే. స్టేడియాల నిర్మాణానికి, ఆటల నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు అవుతాయి. 2010లో చివరిగా కామన్వెల్త్ క్రీడల రూపంలోనే ఓ పెద్ద క్రీడల సంబరం జరిగింది. దిల్లీ వేదికగా నిర్వహించిన ఈ పోటీల కోసం భారత్ ఎంతో ఖర్చు పెట్టి స్టేడియాలు నిర్మించింది. క్రీడా గ్రామాన్ని నిర్మించి ఆటగాళ్లకు వసతులు కల్పించింది. ఆనాడు నెలకొల్పిన ఆటల సముదాయాలే నేటికీ ఉపయోగపడుతున్నాయి. చాన్నాళ్ల తరవాత మళ్లీ కామన్వెల్త్ సంబరం మన దేశానికి వస్తే కచ్చితంగా మరింత మెరుగ్గా, ఇంకా ఆడంబరంగా ఈ క్రీడలను నిర్వహించడం ఖాయం. ఎందుకంటే 2036 ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించాలని మోదీ సర్కారు పట్టుదలతో ఉంది. ఖర్చు ఎక్కువైనా ప్రపంచం దృష్టిని ఆకర్షించాలని అనుకుంటోంది.

వసతుల పరిశీలన ఈసారి కామన్వెల్త్ క్రీడలకు అహ్మదాబాద్ లేదా భువనేశ్వర్ వేదికగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల భారత్‌లో పర్యటించిన కామన్వెల్త్ క్రీడల అధ్యక్షుడు క్రిస్ జెర్కిన్స్, సీఈవో కేథీ సాడ్లియర్ గాంధీనగర్, భువనేశ్వర్‌తో పాటు దిల్లీలో వసతులను పరిశీలించారు. తన ఆధ్వర్యంలో ఓ పెద్ద క్రీడా పోటీలను నిర్వహించాలని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష ఎప్పటి నుంచో దృఢ సంకల్పంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ అంశాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారు. మరోవైపు, ఒకప్పటి పొరపాట్లు ఇప్పుడు పునరావృతం కాకూడదని ప్రభుత్వం భావిస్తోంది. 2010 దిల్లీ వేదికగా నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్‌లో అవినీతి బట్టబయలు కావడంతో భారత్ అపఖ్యాతి పాల్కైంది. ఆనాటి క్రీడల ప్రాథమిక అంచనా వ్యయం రూ.1,620 కోట్లు. అయితే చివరికి రూ.70వేల కోట్ల దాకా లెక్క తేల్చారు. ఆటల నిర్వహణలో, స్టేడియాల నిర్మాణంలో తప్పుడు లెక్కలు చూపించి అధికారులు అవినీతికి పాల్పడ్డారని దర్యాప్తులో వెల్లడైంది. పారదర్శకంగా గేమ్స్‌ను నిర్వహించకపోవడంతో ఆ స్థాయిలో మరో పెద్ద క్రీడా సంబరం భారత్‌లో జరగలేదు. ఒలింపిక్స్‌లో మునుపటి కంటే మెరుగైన ప్రదర్శన చేస్తుండటం, క్రీడా వసతులు పెరగడంతో మన దేశంలో మెగా క్రీడోత్సవాల ఆతిథ్యానికి మార్గం సుగమం అయ్యింది. రొటేషన్ విధానం ప్రకారం హాకీ, బ్యాడ్మింటన్, షూటింగ్, రెజ్లింగ్ లాంటి ఆటలను 2026 క్రీడల్లో కామన్వెల్త్ సమాఖ్య తొలగించింది. దీనివల్ల భారత్‌కు పతక అవకాశాలు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉంది. కీలక ఆటలను తీసేయడం వల్ల ఎక్కువమంది అథ్లెట్లను కూడా పంపలేని పరిస్థితి. 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో పాల్గొన్న భారత బృందంలో 210 మంది ఉంటే- 2026లో ఇందులో సగం మందిని కూడా బరిలో దించే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు 2026లో జపాన్‌లో ఆసియా క్రీడలు కూడా ఉండటంతో కొందరు స్టార్ అథ్లెట్లు కామన్వెల్త్ క్రీడలకు గైర్హాజరయ్యే అవకాశం ఉంది.

కొంతమంది సీనియర్ అథ్లెట్లకు వయసు సమస్యగా మారింది. 2026 ఏడాదితోనే కెరీర్ ముగించాలని వారిలో చాలామంది భావిస్తున్నారు. 2026 కామన్వెల్త్‌లో టేబుల్ టెన్నిస్‌ను తొలగించడంతో ఈ క్రీడలో 13 పతకాలు గెలిచిన స్టార్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ ఇటీవలే రిటైర్ అయ్యారు. బ్యాడ్మింటన్, రెజ్లింగ్‌లోనూ స్టార్ ప్లేయర్లు అప్పటిదాకా కొనసాగలేకపోవచ్చు. పి.వి.సింధు, బజ్‌రంగ్ పునియాలే ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యంలో భారత్‌కు 2030లో ఆతిథ్య అవకాశం దక్కితే కొందరు స్టార్ ప్లేయర్లు అప్పటిదాకా కెరీర్‌లు పొడిగించుకోవచ్చు.

## పంచాంగం

శుక్రవారం 21-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. సప్తమి తె. 4.24 |
| నక్షత్రం | : జ్యేష్ఠ రా. 1.46 |
| వర్జ్యం | : తె. 7.24 ల 8.43 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# బొమ్మను చేసి.. ప్రాణము పోసి..

## నేడు ప్రపంచ తోలుబొమ్మలాట దినోత్సవం



**తో**లుబొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించుకున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడంలోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలుబొమ్మలాట చారిత్రక పరిణామాలు గమనిస్తే ఒకప్పుడు విలక్షణమైన ఉన్నతిని అనుభవించిన ఈ కళ మొత్తం భారతీయ జానపద కళారూపాల్లోనే విశిష్ట స్థానాన్ని పొంది ఉంటుందని చెప్పవచ్చు. నృత్య దశలో నుండి మానవుడు నాటక దశలోనికి ఎదిగే పరిణామ క్రమంలో తోలుబొమ్మలాట ప్రముఖ పాత్ర వహించింది. జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళగా ఈ కళారూపాన్ని గుర్తించవచ్చు. తోలుబొమ్మల పుట్టుక మీద అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింప చేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలుబొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలుబొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమరకోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు.

ఈ తోలుబొమ్మలు ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నాల నుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి. పాశ్చాత్యదేశాలలో జరిగే ఉత్సవాలలో తోలుబొమ్మలను ప్రదర్శించడాన్ని బట్టి చూస్తే ఈ కళకు ఇతర దేశాల్లో బహుళ ఆదరణ లభించిందని తెలుస్తున్నది. పర్షియా, టర్కీ ల మీదుగా గ్రీసు దేశంలో ప్రవేశించిన తోలుబొమ్మలు, గ్రీసులో నూతన రూపం సంతరించుకుని ఉత్తరాఫ్రికా లోని ముస్లిం దేశాలకు, 17వ శతాబ్దంలో ఇటలీ కి, అక్క డినుండి ఫ్రాన్స్ లోని వెర్సయిల్స్, పారిస్, పేలేరాయల్ నగరాలకు వ్యాపించాయి. తోలుబొమ్మలు కాలానుగుణంగా ఆయాదేశాల్లో భిన్న రూపాలు ధరించినప్పటికీ, భారతదేశం వీటికి మాతృక అని చెప్పవచ్చు. 2డి యానిమేషన్ దిశగా మొదటి అడుగు బొమ్మాలటదే. ఛాయాచిత్రం, నీడల్తో ఆకృతులు వంటివి బొమ్మలాటకు దారితీశాయి. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలుబొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలుబొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది.

చరిత్రకారుల ప్రకారం తోలుబొమ్మలు నాగరికత అంత పురాతనమైనవి. క్రీ.పూ 2500 సం.నకు వెనక్కి వెళ్తే, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించింది. క్రీ.పూ 6వ శతాబ్దమునకే భారతదేశంలో తోలుబొమ్మల ప్రదర్శనశాల ఉంది. అప్పటినుండే వివిధ పల్లె ప్రాంతాల్లో వినోదాన్ని అందిస్తోంది . మహాభారతంలో తోలుబొమ్మలాట ప్రస్తావన ఉంది. చీరమరుగున బొమ్మలనాడిరచు వారు అన్న పాల్కురికి సోమన చెప్పిన పద్యంలో తోలుబొమ్మలనే ప్రస్తావించారు. భగవద్గీతలో సత్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్మునిచేత మానవ జీవన గమనంలో లాగబడుతుంటాయని చెప్పబడిరది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడిరచేవాడు భగవంతుడు అన్న అర్థంలో ఉన్న ఈ భాగం నిజానికి తోలుబొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలం నాటి వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధానమైనదని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. ప్రాచీన భారతదేశంలో బొమ్మలాట ఒక పవిత్రమైన కళగా భావించబడిరది. ఇది ప్రాచీన కాలపు సినిమాగా భావించబడిరది. వినోద సాధనంగానే కాకుండా ప్రభోదాత్మక సాధనంగా కూడా ఈ కళారూపాన్ని జానపదుడు మలచుకున్నాడు. తరువాతి కాలంలో వెలువడిన నాటకానికి బొమ్మలాట నాంది పలికింది. నాటకమే తరువాతి సినిమాకు మూలం. కాబట్టి పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించుకున్నాడు. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మలాటలూ, కట్టెబొమ్మలాటలు, తొడుగు బొమ్మలాటలు, తోలు బొమ్మలాటలు, బుట్టబొమ్మలాటలు, తోలుబొమ్మలాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. తోలుబొమ్మల తయారీ చాలా శ్రమతో కూడుకున్న పని. వీటి తయారీకి జింక, లేడి లేదా దుప్పి, మేక ఈ మూడు రకాల జంతువుల తోళ్ళను వాడతారు. చైనాలో గాడిద చర్మంతోను, గ్రీసుదేశంలో ఒంటె చర్మంతోను తోలుబొమ్మలను తయారు చేస్తారు. పచ్చితోళ్ళను పరిమితమైన వేడి నీటిలో నానబెట్టి బండమీద లేదా చదునైన చాపమీద పరచి తోలుపై ఉన్న వెంట్రుకలను తొలగిస్తారు. ఆ తర్వాత తోలుకు మిగిలి ఉన్న పల్చటి చర్మపుపొరను పదునైన కత్తి సహాయంతో తీసివేసి మరోసారి వేడి నీటిలో వేసి ఉప్పుతో శుభ్రపరుస్తారు. శుభ్రపరిచిన తోలును మేకుల సహాయంతో చతురస్రాకారపు చెక్కకు బిగించి ఆరవేస్తారు. ఇన్ని దశల్లో శుభ్రపరచిన తోలు పలచనిపొరగా, పారదర్శకంగా తయారై దీపపుకాంతి ప్రసరించే విధంగా అవుతుంది. జింక చర్మాలను దేవతలు, పౌరాణిక కథానాయకులలాంటి ముఖ్యమయిన పాత్రల బొమ్మలను తయారు చెయ్యడంలో ఉపయోగిస్తారు. లేడి చర్మం బాగా మన్నిక గలది గనుక దీనిని భీముడు, రావణుడు లాంటి యోధుల బొమ్మలను తయరు చెయ్యడానికి ఉపయోగిస్తారు. హాస్యపాత్రల వంటి మిగిలిన బొమ్మల కోసం సులభంగా దొరికే గొర్రె చర్మాన్ని ఉపయోగిస్తారు. సాధారణంగా ఒక్కొక్క బొమ్మ తయారు చెయ్యడానికి ఒక చర్మం సరిపోతుంది. కానీ రావణుడు వంటి కొన్ని బొమ్మలు తయారు చెయ్యడానికి ఎక్కువ చర్మం అవసరమవుతుంది. రావణుడి బొమ్మను తయారు చెయ్యడానికి కనీసం నాలుగు చర్మాలు అవసరమౌతాయి. ఎంపిక చేసుకున్న బొమ్మలకు రేఖాచిత్రాల ఆధారంగా ప్రకృతిసిద్ధమైన కరక్కాయ, చింత గింజల పొడి, అన్నభేది మొదలైన రంగులచే తోలు బొమ్మలకు ఇరువైపుల రంగులు వేస్తారు. ప్రస్తుతం ఆధునికులు పారదర్శకమైన రంగులను ఉపయోగిస్తున్నారు. తోలుబొమ్మలు తల, మొండెము కలసి ఒక భాగంగా, చేయిని మూడు భాగాలుగా, కాలును రెండు భాగాలుగాను తీర్చిదిద్ది అన్నింటిని ఒక దగ్గరకు చేర్చి సూత్రం (దారం) ద్వారా కలుపుతారు. అదేవిధంగా ఈ బొమ్మలను ఆడిరచడానికి వీలుగా బొమ్మకు నిలువుగా ఒక ఈత బద్దను పైనుండి క్రింద వరకు అమర్చి రెండుకాళ్ళ మధ్యభాగంలో పిడికెడు బద్దను వదులుతారు. ఈవిధంగా వదిలిన బద్దను పట్టుకుని ఆడిస్తారు. తోలుబొమ్మలు తమకు తామే తయారు చేస్తారు. ఈ బొమ్మల తయారీకి జింక, దుప్పి, మేక, మేకపోతు, గొర్రె మొదలైన జంతువుల చర్మాలను వాడతారు. కానీ ఇప్పుడు ఇవి దొరకనందున మేక చర్మాలను వాడుతున్నారు. మాంసం పొర, వెంట్రుకలు తీసివేసిన ఈ తోలు పారదర్శకంగా ఉంటుంది. ఈ పారదర్శకత కలిగిన తోలుపై పెన్సిలుతో కావలసిన బొమ్మ గీసుకొని కత్తెరతోగానీ, గోరుగిల్లుడుతో గాని కత్తిరిస్తారు. తరువాత బొమ్మకు నగిషీ పనులు చేస్తారు. హారాలు, పూలహారం, కిరీటం, వజ్ర వైడూర్యాది ఆభరణాలు సొగసుగా చేస్తారు. ఈ ఆకారాల్లోని బెజ్జాలు దీపపు కాంతికి ఆభరణాలుగా మెరుస్తాయి. తరువాత రంగులు వేస్తారు. రంగులు వేసేవారిని రంగరాజులు అంటారు. ఇంటిలోని వారంతా రంగులు వేయడంలో ఆరితేరి ఉంటారు. బొమ్మలు రెండు రకాలు. తొలుబొమ్మల తయారీలో తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి నిమ్మలకుంట కళాకారులు ఈ పరిశోధకునికి వివరించారు. ఒకప్పుడు ఆదరణ ఉన్న ఈ కళ ఇప్పుడు ఆదరణ కోలుపోవడం వలన మేక చర్మాలు దానం చేసేవారు కరువయ్యారని, ఇప్పుడు మేకచర్మాలను తాము కొంటున్నామని, కొన్న తరువాత వాటిని తీసుకుని వచ్చేటప్పుడు రవాణాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడిరచేటప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డుతగలకుండా ఉంటుంది. తోలుబొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. అయితే విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు. ప్రదర్శన సంబంధమైన కదలికలకు అనుగుణంగా ప్రధాన గాయకుడు పాడుతూ వుంటే, మిగిలినవారు వంతలుగా పాడుతారు. వంతల్లో స్త్రీలు ప్రధానంగా ఉంటారు. రాగం తీయడం, ముక్తాయింపు, సంభాషణ ధోరణిలో స్త్రీ గొంతు ముఖ్యపాత్ర వహిస్తుంది. మైకులు వంటి సాధనాలు లేకుండా విశాలమైన మైదానంలో ఉన్న ప్రేక్షకులను ఆకట్టుకోవాలంటే వారి గొంతు స్థాయిని ఊహించుకొనవచ్చు.

వీరికి హార్మోనియం శృతిగా ఉంటుంది. తాళాలుంటాయి. వాయించే వ్యక్తులు కూడా వెనుక కూర్చొని వంత పాడుతుంటారు. అంతే కాదు, వాళ్ల కాళ్ళక్రింద బల్లచెక్కలుంటాయి. ఆయా ఘట్టాలననుసరించి ఈ చెక్కలను తొక్కుతుంటారు. ముఖ్యంగా రథాలు, గుఱ్ఱాలు, యుద్ధఘట్టాలలో ఈ చెక్కలు టకటకా త్రొక్కుతుంటే మంచి రసవత్తరంగా ఉంటుంది. నగారా మోతలకు ఖాళీ డబ్బాలు ఉపయోగిస్తారు. ఉరుములు ఉరిమినట్టూ, పిడుగులు పడ్డట్టూ డబ్బాలు మ్రోగిస్తారు.

సుసంపన్నమైన హిందూ ఇతిహాసాలను తెరమీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలుబొమ్మలాట. తర్వాత కాలంలో కనిపెట్టబడిన చలనచిత్రాలు, దూరదర్శని ఆధునిక పరిజ్ఞానం సహాయంతో అవే ఇతిహాసాలను మరింత మెరుగైన రీతిలో ప్రదర్శిస్తున్నాయి. అయినప్పటికీ తోలుబొమ్మలాట అనే ఈ అద్భుతమైన ప్రదర్శన కళ దక్షిణ ఆసియా ప్రాంతపు ప్రదర్శన కళల చరిత్రను అర్థం చేసుకోవడంలో కీలకమైన పాత్ర పోషిస్తోందని తోలుబొమ్మలపై పరిశోధన చేసిన ఆచార్యుడు బ్రూస్ టేపర్ తన పరిశోధనా వ్యాసంలో వ్యాఖ్యానించాడు. ఇంతటి ఉన్నత ప్రమాణాలతో నిండిన తోలుబొమ్మలాట వంశపారం పర్యంగా వస్తున్న ఒక కళా సంస్కృతి. వేల సంవత్సరాలుగా మౌఖికంగా వస్తూ జానపదుల గుండెల్లో గూడుకట్టుకున్న ఉత్కృష్టమైన కళాప్రక్రియ. రామాయణ, మహాభారత, భాగవత కథ లను అలవోకగా చెప్పే తోలుబొమ్మల కళాకారుల మాతృభాష మరాఠీ అంటే ఆశ్చర్యం కలిగించక మానదు. మహారాష్ట్ర నుండి వలస వచ్చిన ఈ కళారూపం ఆంధ్రదేశంలో ఒక ప్రముఖ కళా రూపంగా అభివృద్ధి చెంది, తెలుగు సంస్కృతిలో మిళితమై, మన జాతీయ సంపదకే వన్నె తెచ్చింది. ఇంతటి ఉన్నతమైన ఈ కళాప్రక్రియ నేడు అతి కొద్ది బృందాలతో జీవిస్తోంది. తోలుబొమ్మల దీపపుకాంతులు చరమాంకంలో ఉన్నాయని చెప్పక తప్పదు. సినిమాలు ప్రజలను సమ్మోహితులను చేయడం, తెరపై ప్రేక్షకులకు కావలసినవి అందించడం, అదేవిధంగా ఇంట్లోనే జనరంజకం అన్న నేపథ్యంలో విస్తృతంగా ఛానల్స్ వచ్చి ప్రపంచ తీరుతెన్నులను మార్చడం వంటి ఎన్నో కారణాలు తోలుబొమ్మలు లాంటి కళారూపాల మనుగడకు సవాలుగా నిలిచాయి. ఇలాంటి విషమపరిస్థితుల్లో, ఇవీ మన ఆనవాళ్ళు అని చెప్పడానికి మన కళారూపాలను బ్రతికించు కోవలసిన అవసరం ఏర్పడిరది. తోలుబొమ్మలాట వంటి కళారూపానికి మరిన్ని మెళకువల్ని జోడించి, దీనిని ఆధునిక మానవుడికి చేరువగా తీసుకెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్
(9490833108)

## చరిత్రలో ఈ రోజు (మార్చి 21)

**సంఘటనలు:**

1857: జపాన్ లోని టోక్యోలో భయంకర భూకంపం. లక్ష మంది మృతి.

1990 : దక్షిణాఫ్రికా పాలనలో 75 సంవత్సరాలు ఉన్న నమీబియాకు స్వాతంత్ర్యం.

జననాలు:

1768: జోసెఫ్ ఫోరియర్, ఫ్రాన్స్ కు చెందిన గణిత, భౌతిక శాస్త్రవేత్త.

1915: మేకా రంగయ్య అప్పారావు, నూజివీడు జమిందారీ కుటుంబానికి చెందిన విద్యావేత్త, మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు

1916: ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్, సెహనాయి విద్వాంసుడు.

1923: 'సహజ రాజయోగ' సంస్థ ప్రారంభకురాలైన భారత మహిళ మాతాజీ నిర్మలాదేవి లేదా నిర్మల శ్రీవాస్తవ

1925: మునిపల్లె రాజు, భారత ప్రభుత్వ రక్షణ శాఖలో ఇంజనీరింగ్ ఉద్యోగి. తెలుగు కథను సుసంపన్నం చేసిన ప్రసిద్ధ రచయిత

1933: నటరాజ రామకృష్ణ, పేరిణి శివతాండవము, నవజనార్దనం వంటి ప్రాచీన నాట్యరీతుల్ని తిరిగి వెలుగులోకి తెచ్చిన నాట్యాచార్యుడు

1942: పచ్చా రామచంద్రరావు, లోహ శాస్త్రజ్ఞుడు

1952: తాతినేని లక్ష్మీ వరప్రసాద్ , తెలుగు, హిందీ, బెంగాలీ, మరాఠీ చిత్రాల దర్శకుడు, రచయిత, నిర్మాత

1970: శోభన, నర్తకి, చలన చిత్రనటి

1978: రాణీ ముఖర్జీ, భారత సినీనటి

మరణాలు:

1942: కొప్పరపు సోదర కవులు, కొప్పరపు వేంకటరమణ కవి, అవధానంలో పేరొందిన జంట సోదర కవులు.

1972: పప్పూరు రామాచార్యులు, తెలుగు కవి,మాజీశాసనసభ్యుడు.

1990: తుమ్మల సీతారామమూర్తి, ఆధునిక పద్యకవుల్లో అగ్రగణ్యుడు. అభినవ తిక్కన బిరుదాంకితుడు.

2013: చినువ అచెబె, ఆధునిక ఆఫ్రికన్ సాహిత్య పితామహుడు.

2022: తల్లావజ్ఝల సుందరం, రంగస్థల నటుడు, దర్శకుడు, ప్రయోక్త, కథ, నవలా, రచయిత.

**దినోత్సవాలు:**

ప్రపంచ అటవీ దినోత్సవం

అంతర్జాతీయ జాతి వివక్ష నిర్మూలన దినోత్సవం

అంతర్జాతీయ రంగుల దినోత్సవం

ప్రపంచ కవితా దినోత్సవం

ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం

ప్రపంచ తోలుబొమ్మలాట దినోత్సవం

అంతర్జాతీయ భూగోళ దినోత్సవం

ప్రపంచ నిద్ర దినోత్సవం (మార్చి మూడవ శుక్రవారం)

# పగ పట్టిన పాము!

## పేరు సుబ్రహ్మణ్యం...కాట్లు 103.. నాటౌట్





ఇదెక్కడి వింతో మరి.ఆయనపేరు సుబ్రహ్మణ్యం. అంటే సాక్షాత్తూ నాగదేవత సుబ్రహ్మణ్యేశ్వరుడి పేరు. కాని హిందువులు సుబ్రమణ్య అవతారంగా భావిస్తున్న పాములు ఈ మానవ సుబ్రహ్మణ్యాన్ని గత 10 సంవత్సరాలుగా103 సార్లు కాటు వేసాయి.చిత్తూరు జిల్లా బైరెడ్డి పల్లి మండలం చల్లారు గుంట వాసి వడ్డెర సుబ్రహ్మణ్యం (47) మీద పాములు పగ పట్టాయని అనుకోవాలి.శాస్తవేత్తలు పాములు పగ పట్టవంటారు. ఇదేదో సినిమా కథ అనుకునేరు. పచ్చినిజం.ఈ నెల 15 తేదీన 103 సారి సుబ్రహ్మణ్యం పాదాలపై కరిచింది. విషం తలకెక్కింది. పెదపంజాణి మండలం జేఎంజే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యులు కష్టపడి ప్రాణాపాయం నుంచి తప్పించారు. ఇన్నిసార్లు పాములు కర్చినా ఆయన బతికి బట్ట కట్టడం ఆశ్చర్యమే. సుబ్రమణ్యం మీద ప్రేమతో ఆయన వద్దకు వస్తున్నాయని గ్రామస్తులు సరదాగా వ్యాఖ్యలు చేస్తుంటారు. ఈ పాము కాట్లు పుణ్యమా అని అతనికున్న ముడెకరాల పొలం అమ్ముకోవాల్సి వచ్చింది. ఇల్లు లేదు. పూరిగుడిసెలో ఉంటూ భార్యాభర్తలు కూలి చేసుకుని బతుకుతున్నారు. ఉన్న చోటు వదిలి వేరే ప్రాంతంలో పనులకు వెళ్లినా పాములు వదలడంలేదు. సర్పదోషనివారణ పూజలు, రాహుకేతు పూజలు చేసినా ఫలితం లేదని అతని భార్య చెబుతున్నది. అతనికి కుమార్తె,కుమారుడు ఉన్నారు.వారి కళ్లు పాము కళ్లు మాదిరిగా ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ముసలి తల్లి కూడా ఉంది. ఏదిఏమైనా సినిమా కథ లాగా ఉన్న సుబ్రమణ్యం కథ సినిమా తీస్తే బాక్స్ లు బద్దలవుతాయని సినీ పండితులు అంటున్నారు. మరి ఏ సినిమా డైరక్టర్ నయినా ఈ ఉదంతం ఆకర్షించి సుబ్రహ్మణ్యం వద్దకు వచ్చి వివరాలు సేకరించి కొంత సహాయం చేస్తే వారి కుటుంబం మూడుపూటలా కడుపు నిండా కూడు అన్నా తింటారు.ఏదిఏమైనా పాములు సుబ్రహ్మ ణ్యాన్నే ఎందుకు కరుస్తున్నాయో శాస్త్ర వేత్తలు పరిశోధన కూడా చెస్తే కొత్త విషయం తెలియ వచ్చు. పాముల పగ పై మరిన్ని విశేషాలు తెలుస్తాయి.

యం.వి.రామారావు,
8074129668

# ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):-** మండలంలో రాగోలపల్లి పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు తెలియజేసారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పిచ్చుకల చిత్ర పటాలు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు పిచ్చుకల దినోత్సవం ఏర్పడిన విధానాన్ని, దాని ఆవశ్యకతను గురించి విద్యార్థులకు వివరించారు.

పిచ్చుకలు, జనావాసాల్లో ఎక్కువగా కనిపించే ఇతర పక్షుల గురించి, వాటి మనుగడకు వాటిల్లుతున్న ముప్పు గురించి ప్రజల్లో అవగాహన పెంచడం దీని వెనుక ఉన్న ఆశయం. ఈ దినోత్సవాన్ని భారతదేశానికి చెందిన నేచర్ ఫరెవ్వర్ సొసైటీ , ఫ్రాన్స్ కు చెందిన ఈకోసిస్ యాక్షన్ ఫౌండేషన్ మరిన్ని జాతీయ అంతర్జాతీయ సంస్థలతో కలసి ప్రారంభించాయి.

నేచర్ ఫరెవ్వర్ సొసైటీ స్థాపకుడు మరియు ప్రకృతి పరిరక్షకుడు ఐన మహమద్ దిలావర్ నాసిక్ లో పిచ్చుకల పరిరక్షణా ప్రయత్నాలలో తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఒకసారి సొసైటీ కార్యాలయంలో కబుర్ల మధ్యలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం అనే ఆలోచన వచ్చింది. పిచ్చుకలు, ఇతర సాధారణ పక్షుల పరిరక్షణను గురించిన సందేశాన్ని ఇవ్వడానికి ఒకరోజును అంకితం చేయడంతోపాటు జీవ వైవిధ్యానికి తగిన అందాన్ని చేకూర్చడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు. ఇది మొదటిసారిగా 2010లో వివిధ ప్రాంతాలలో వేర్వేరుగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా కళల పోటీలు, అవగాహనా సదస్సులు, ఊరేగింపులు జరిగాయి.

పక్షుల మనుగడకున్న ముప్పులపై అవగాహనతో పాటు ప్రపంచ నలుమూలలా ఉన్న పక్షి పరిరక్షకులు ఒకరితో ఒకరు సంప్రదించుకొని, సహకరించుకొనడం ఈ దినంయొక్క లక్ష్యం అని అన్నారు.

విద్యార్థులు కూడా పక్షుల పరిరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కుమారి, మ. భో.కార్మికురాలు వరలక్ష్మి, విదార్థులు ఉన్నారు.

## Spoken English -6

Hello. / Hi.
హలో. / హాయ్. - (Halo. / Hay.)
How are you?
మీరు ఎలా ఉన్నారు? - (Miru ela unnaru)
I am fine. And you?
నేను బాగానే ఉన్నాను. మరియు మీరు? - (Nenu bagane unnanu. Mariyu miru?)
What is your name?
నీ పేరు ఏమిటి? - (Ni peru emiti?)
My name is Aaditya.
నా పేరు ఆదిత్య. - (Na peru aditya.)
I am pleased to meet you.
మిమ్మల్ని కలవడం నాకు సంతోషంగా ఉంది.
(Mim'malni kalavadam naku santosanga undi.)
Thank you.
ధన్యవాదాలు. - (Dhan'yavadalu.)
You are welcome.
మీకు స్వాగతం. - (Miku svagatam.)
Do you speak English?
మీరు ఇంగ్లీష్ మాట్లాడతారా? - (Miru inglis matladatara?)
I don't speak English well.
నాకు ఇంగ్లీషు బాగా రాదు. - (Naku inglisu baga radu.)
I speak a little Spanish.
నేను కొంచెం స్పానిష్ మాట్లాడుతాను. - (Nenu koncem spanis matladutanu.)
Do you understand?
నీకు అర్థమైనదా? - (Niku ardhamainada?)
I don't understand.
నాకు అర్థం కాలేదు. - (Naku artham kaledu.)
Please speak slowly.
దయచేసి మెల్లగా మాట్లాడండి. - (Dayacesi mellaga matladandi.)
Please say it again.
దయచేసి మళ్లీ చెప్పండి. - (Dayacesi malli ceppandi.)
I am looking for the Hotel.
నేను హెూటల్ కోసం చూస్తున్నాను. - (Nenu hotal kosam custunnanu.)
How can I get there?
నేను అక్కడికి ఎలా చేరుకోను? - (Nenu akkadiki ela cerukonu?)
I would like to book a room.
నేను ఒక గదిని బుక్ చేయాలనుకుంటున్నాను. - (Nenu oka gadini buk ceyalanukuntunnanu.)
How much is it per night / person?
ఒక రాత్రికి/వ్యక్తికి ఎంత? - (Oka ratriki/vyaktiki enta?)
Can I change money?
నేను డబ్బు మార్చవచ్చా? - (Nenu dabbu marcavacca?)
I would like to buy a wine.
నేను వైన్ కొనాలనుకుంటున్నాను. - (Nenu vain konalanukuntunnanu.)
How much is this?
ఇది ఎంత? - (Idi enta?)
Can I have a receipt, please?
దయచేసి నాకు రసీదు ఇవ్వవచ్చా? - (Dayacesi naku rasidu ivvavacca?)

**By Dr.P.V.Ram, 9553574250**

# గ్రామాభివృద్ధిపై బీజేపీ నాయకుల పరిశీలన



**తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):-** తాళ్లపూడి మండల తిరుగుడుమెట్ట గ్రామానికి బీజేపీ నాయకులు విచ్చేసి, నరేంద్ర మోడీ ఫోటోని ఆవిష్కరిస్తరు.

పామర్తి పవన్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో, జరిగిన మోడీ ఫోటో ఆవిష్కరణ కార్యక్రమానికి, అలాగే తిరుగుడు మెట్ట స్థానిక సమస్యల తెలుసుకోవడం కోసం, గ్రామ అభివృద్ధి ఏ స్థాయిలో జరుగుతుందో తెలుసుకోవడం కోసం విచ్చేసియున్నారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల సీనియర్ నాయకులు, కొమ్మిరెడ్డి శ్రీనివాస్, కలిశెట్టి సన్యాసినాయుడు, చెల్లింకుల రాధాకృష్ణ ,తిరుమల శెట్టి కృష్ణ, రామ రంగనాయకుల, ఇమ్మని అనసూయమ్మ, మద్దుకూరి అరుణ, వల్లభ శెట్టి మణికంఠ, వల్లభ శెట్టి కృష్ణ చైతన్య, కోరం హరి,

తిరుగుడు మెట్ట స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మోడీ ఫోటోని తిరుగుడుమెట్ట ఎంపీపీ స్కూల్లో ఆవిష్కరించి ఆయన గురించి వివరించారు.

అలాగే మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు గురించి తెలుసుకున్నారు.

తిరుగుడుమెట్ట గ్రామంలో విఆర్ఓతో కలిసి భారతీయ జనతా పార్టీ నాయకులు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది.

గ్రామంలో ఉన్న సమస్యలను బిజెపి సీనియర్ నాయకుల మార్కండేయులు , తిరుగుడు మెట్ట స్థానికులు వివరించడం జరిగింది.

దానిలో ముఖ్యమైన మూడు సమస్యలు:-

1. తిరుగుడు మెట్ట ఆర్టీసీ బస్ సర్వీస్ తిరిగి పున ప్రారంభించాలని తిరుగుడు మెట్ట స్థానికులకు కోరడం జరిగింది
2. అలాగే తిరుగుడు మెట్ట సెంటర్లో డ్రైనేజ్ కి ఇరువైపులా కల్వర్టు లేకపోవడం వల్ల చాలామంది ప్రజలు ఆ డ్రైనేజీలో పడి గాయాలు పాలవటం జరుగుతుంది దీని గురించి వెంటనే పరిష్కారం చేయాలని స్థానికులు మొరపెట్టుకున్నారు.
3. పెద్దవం నుంచి తిరుగుడు మెట్ట వచ్చే మార్గంలో పెద్దమలుపు తర్వాత రెండు మూడు చోట్ల కూడా కల్వర్టు లేకపోవడం వల్ల చాలామంది స్థానికులు గాయాల పాలవటం జరుగుతూ వస్తుంది అని వినిపించారు

4.. అలాగే గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగిమరీ తెలుసుకొని సక్రమమైన మార్గంలో ప్రతి పనులు జరగాలని తిరుగుడు మెట్ట సచివాలయం ఉద్యోగులకి కొమిరెడ్డి శ్రీనివాస్ భారతీయ జనతా పార్టీ మండల అగ్ర నాయకులు దిశానిర్దేశం ఇవ్వటం జరిగింది .ఈ సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని భారతీయ జనతా పార్టీ నాయకులందరూ గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.

# గాయత్రిలో టెక్ ట్రానిక్స్-2 సదస్సు ప్రారంభం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ కోర్సెస్ అటానమస్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నందు టెక్ ట్రానిక్స్ సీజన్-2 2కె25 కార్యక్రమాన్ని గౌరవనీయులైన ప్రొఫెసర్ పి. రాజగణపతి మెంబర్ జి.వి.పి., ప్రొఫెసర్ డి.దక్షిణామూర్తి, వైస్ ప్రెసిడెంట్ జి.వి.పి.,ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.ఎస్.బోస్, ప్రొఫెసర్ పి.వి. వినయ్, డైరెక్టర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్రొఫెసర్ గిరిధర్, డైరెక్టర్ యు.జి. ప్రోగ్రామ్స్, ప్రొఫెసర్ డి. శరిత, డీన్ కెరీర్ గైడెన్స్, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. ఏ.



నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, మరియు దీనిలో ముఖ్యఅతిథిగా శ్రీ.పి. గోపాలకృష్ణ, టెక్నికల్ మేనజర్, యూనివర్సిటీ ప్రోగ్రామ్ హెడ్, ఫైటెక్ విశాఖ పట్టణం, టెక్ ట్రానిక్స్ 2కె25ను ప్రారంభ సదస్సును ప్రారంభించారు. దీనిలో భాగంగా ప్రథమ,ద్వితీయ తృతీయ, చివరి సంవత్సర ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. మరియు శ్రీ. పి. గోపాలకృష్ణ గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు విఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ అంశాలు మరియు వారి యొక్క విజ్ఞానంతో రూపొందించిన ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ రోబోను ప్రదర్శించి దాని యొక్క సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుపుతూ, ఈ రంగంలో విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

# చీడ పీడల నివారణకు జిగురు అట్టలు వినియోగించాలి



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** రైతులు వరి పంటలో చీడ పీడల నివారణకు జిగురు అట్టలు వినియోగించాలని ఆచార్య ఎన్జి రంగా విశ్వావిద్యాలయం కింజరాపు ఎర్రం నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. బుధవారం బుచ్చయ్యపేట మండలం పి. భీమవరం లో అనకాపల్లి జిల్లా కొండెం పూడి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజ్ కుమార్, టి ఓ టి డాక్టర్ కిషోర్ పర్యవేక్షణ లో గ్రామీణ వ్యవసాయం పని అవగాహన, అనుభవం కార్యక్రమం లో భాగంగా (ఎచ్చెర్ల) కింజరాపు అచ్చం నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు చీడపీడల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులకు అవగాహన కల్పిస్తూ వరి పంటలో చీడ పీడలు నివారణకు జిగురు అట్టలు వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా వరిపంటలో దోమ పోటు ఎక్కువగా ఉంటుంది కాబట్టి రైతులు జిగురు అట్టలు వినియోగించు కోవాలని సూచించారు. అలాగే రైతులు సులభంగా ఇంట్లో ఆముదం, తుమ్మ జిగురు తో అట్టలు తయారు చేసుకోవచ్చని తెలిపారు. కాబట్టి అధిక ఖర్చు లేకుండా చీడ పీడల నివారణకు రైతులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ కళాశాల విద్యార్థులు డి. ప్రసన్న,హారికప్రియ, హేమలత, మమత, ప్రశాంతి రైతులు పాల్గొన్నారు.

# శక్తివంతమైన యువత దేశానికి కావాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** డా. చల్లా కృష్ణవీర్ అభిషేక్, డీన్ వాన్ లూవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు ఇక్వి4పీస్ వరల్డ్వైడ్ (యూఎస్ఎ) బోర్డు సభ్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని రాజనీతి శాస్త్ర మరియు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రత్యేక ప్రసంగాన్ని అందించారు.లి "పాత వే టు స్ట్రాటజిక్ పీస్ కమ్యూనికేషన్స్ డైమెన్షన్స్ అండ్ ఛాలెంజెస్" అనే అంశంపై జరిగిన ఈ సెషన్, విద్యార్థులు, పరిశోధకులకు మరియు పీస్ స్టడీస్ అభ్యాసకులను ఆకర్షించింది.

ఆయన రాజనీతి శాస్త్రం ద్వారా సమాజాన్ని మార్చడంలో యువత యొక్క పాత్ర గురించి తమ ఆలోచనలు పంచుకున్నారు.

వేటి ప్రపంచంలో సమాజం అనేక సమస్యలతో పోరాడుతోంది, మొబైల్ మరియు పోషల్ మీడియా అలవాట్లు పెరుగుతున్నాయి. వ్యక్తులలో, ప్రత్యేకంగా యువతలో, నిరాశ మరియు ఆవేదన పెరిగిపోతున్నాయి. ఈ సవాళ్ల మధ్య డా. కృష్ణవీర్ సమాజ మార్పుకు యువతను కలలిస్ట్ గా చూడాలని సూచించారు. ఆయన, రాజనీతి శాస్త్రం యొక్క శక్తిని %ఎమ్ఞఅఱఅస్త్రటబశ్రీ ఎ్ఞ్ఖఅస్త్రవ% (అర్థపూర్వక మార్పు) సృష్టించడంలో ప్రాముఖ్యతను తెలియజేశారు.

డా. అబిషేక్, మైండ్సెట్ మార్పును సమాజ మార్పు కోసం మొదటి అడుగుగా గుర్తించి, ఈ రోజు పెరిగిన సోషల్ మీడియా వినియోగం మరియు మొబైల్ ఫోన్లతో బందిలో చిక్కుకున్న యువతను ఉద్దేశించి, "ప్రస్తుతం జీవించండి" అని ప్రేరేపించారు. భవిష్యత్తు గురించి ఆందోళనలు లేకుండా వ్యక్తిగత అభివృద్ధి పై దృష్టి పెట్టాలని చెప్పారు. "పాజిటివ్ మరియు ప్రగతిశీల సమాజం సృష్టించడానికి స్వీయాభివృద్ధి ప్రయాణాన్ని స్వీకరించడం ముఖ్యం" అని డా అభిషేక్ అన్నారు. రాజనీతి శాస్త్రం మరియు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఈ శాస్త్రాల ద్వారానే సమాజం యొక్క సంక్లిష్టతలను అర్థం చేసుకోవచ్చుననీ, తద్వారా యువత సమాజానికి అవసరమైన మార్పులను అవశ్యకమవుతుందని డా. అభిషేక్ చెప్పారు.

రాజనీతి శాస్త్రం యువతకు ఒక ప్రత్యేక వేదికగా ఉంటుందని,



ఇది సమాజ అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించడానికి సహాయపడతుందని చెప్పారు. మహాత్మా గాంధీ, మదర్ తెరేసా, డా. బి.ఆర్ అంబేడ్కర్ లాంటి నాయకుల నుంచి ప్రేరణ తీసుకుని, సమాజానికి సేవ చేయాలని డా. అభిషేక్ అన్నారు.

"గాంధీజీ నిష్కల్మష సేవను మదర్ తెరేసా నిష్కల్మష సేవ యొక్క ప్రాముఖ్యతను డా. అంబేద్కర్ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారు" అని డా. అభిషేక్ చెప్పాడు.

టెక్నాలజీ మరియు నైతిక విలువల మధ్య పెరిగే దూరాన్ని పరిష్కరించడానికి యువత ముందుకు రాలంటూ, రాజనీతి శాస్త్రం మార్గదర్శకంగా మారుస్తుందని ఆయన అన్నారు.

ముఖ్యంగా, సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు రాజనీతి శాస్త్రం ద్వారా యువత మార్పు కోసం ముందుకు వచ్చి, న్యాయం, సమానత్వం మరియు శాంతి అనే విలువలను అందించగలుగు తారని ఆయన నమ్ముతున్నారు."యువత నేటి నాయకులు" అని డా.అభిషేక్ అన్నారు. ప్రొఫెసర్ పెటిటి ప్రేమానందం, రాజనీతి శాస్త్ర, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి అధ్యక్షత వహించారు. డా. జి. వీర్రాజు, డా. వీ హరిబాబు, డా సత్యనారాయణ, డా. నాగరాజు, డా. కె. రత్న రాజు, ఇతరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## డీసీహెచ్ఎస్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉద్యోగాలు



ప్రకాశం జిల్లా, డీసీహెచ్ఎస్ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏరియా ఆసుపత్రుల్లో ఒప్పంద, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకీ దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టు పేరు-ఖాళీలు**

1. ఆడియోమెట్రిక్ టెక్నీషియన్: 01
2. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2: 02
3. థియేటర్ అసిస్టెంట్- 03
4. ఆఫీస్ సబార్డినేట్: 02
5. పోస్ట్ మార్టం అసిస్టెంట్: 02
6. జనరల్ డ్యూటీ అటెండెంట్- 06

మొత్తం ఖాళీల సంఖ్య: 16

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో బీఎస్సీ ఉత్తీర్ణత, డీఎంఎల్టీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాది అప్రెంటీస్‌షిప్ చేసి ఉండాలి.

వయోపరిమితి: 01.07.2024 తేదీ నాటికి 42 మించకూడదు. ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: ఆడియోమెట్రిక్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2 పోస్టులకు రూ.32,670బీ ఇతర పోస్టులకు రూ.15,000.

**దరఖాస్తు ఫీజు:** ఓసీ అభ్యర్థులకు రూ.500, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, ఉద్యోగానుభం తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: 24-03-2025.

దరఖాస్తు ప్రక్రియ: ఆఫ్‌లైన్ ద్వారా.

చిరునామా: ఆఫీస్ ఆఫ్ ది డీసీహెచ్ఎస్ ప్రకాశం చిరునామాకు మార్చి 24 లోపు పంపించాలి.

## భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్-హైదరాబాద్‌లో ఖాళీలు



ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ, నవరత్న హెూదా కలిగిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 9వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టు పేరు-ఖాళీలు**

1. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ(ఈఏటీ): 08
2. టెక్నీషియన్ సీ: 21
3. జూనియర్ అసిస్టెంట్: 03

మొత్తం ఖాళీల సంఖ్య: 32

**డీసీహెచ్ఎస్ ప్రకాశం జిల్లాలో ఖాళీలు**

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 1-03-2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.21,500 - రూ.82,000, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ట్రైనీకి రూ.24,500 - రూ.90,000.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.250, ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.

దరఖాస్తుకు చివరి తేదీ: 09-04-2025.

## ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో నాన్ టీచింగ్ ఖాళీలు




దిల్లీలోని ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. కింది నాన్ టీచింగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు:

1. సీనియర్ మేనేజర్ (బిజినెస్ డెవలప్‌మెంట్)- 01
2. మేనేజర్ (ప్లేస్‌మెంట్స్ అండ్ కార్పొరేట్ రిలేషన్)- 01
3. మేనేజర్ (కమ్యూనికేషన్ అండ్ బ్రాండింగ్)- 01
4. అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్- 01
5. అసిస్టెంట్ లైబ్రేరియన్- 01
6. లైబ్రరీ అసిస్టెంట్- 01
7. అకౌంటెంట్- 01
8. మేనేజర్ (రెగ్యులేటరీ అండ్ అక్రిడిటేషన్)-01
9. ఎగ్జిక్యూటివ్ (హెచ్ఆర్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్)- 01
10. ఎగ్జిక్యూటివ్ (రిసెర్చ్ అండ్ పబ్లికేషన్)- 02
11. ఎగ్జిక్యూటివ్ (ప్లేస్‌మెంట్స్ అండ్ కార్పొరేట్ రిలేషన్స్)- 01
12. ఎడిటోరియల్ ఇన్‌చార్జ్- 01
13. సోషల్ మీడియా సెంటర్ క్రియేటర్- 01
14. గ్రాఫిక్ డిజైనర్- 01
15. అడ్మిషన్ కౌన్సలర్- 02
16. రిసెర్చ్ అసిస్టెంట్/ అసోసియేట్- 01

మొత్తం పోస్టుల సంఖ్య: 18

GSV: జీఎస్వీ, గుజరాత్‌లో నాన్ టీచింగ్ ఖాళీలు

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిగ్రీ, ఎంబీఏ/ పీజీ/ పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు తదితర నైపుణ్యాలు ఉద్యోగానుభవం ఉండాలి.

దరఖాస్తు విధానం: మెయిల్ ద్వారా.

ఈమెయిల్: stafferrecruitment@fsm.ac.in

దరఖాస్తు గడువు: 01.04.2025.

# ఉచిత కంటి వైద్య శిబిరం



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- శ్రీ వేంకట పద్మ మెడికల్ ఆధ్వర్యం లో ఉచిత కంటి వైద్య శిబిరం దగ్గర శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి బుదవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరం లో 142 మంది హాజరయ్యారు. దీనిలో 29 మందికి గాను శస్త్ర చికిత్స (ఆపరేషన్ నిమిత్తం) శంకర్ ఫౌండేషన్, విశాఖపట్నం ఆసుపత్రి కి తీసుకుని వెళ్లడం జరిగింది. ఈ వైద్య శిబిరం కీ వచ్చిన కు రోగులకు ఉచిత వైద్యం, మందులు అందజేశారు. ఈ కార్యక్రమం లో వైద్యలు అరుణ్ కుమార్ (శంకర్ ఫౌండేషన్ సిబ్బంది ఏ. శివ కుమార్, వేంకట పద్మ మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రండి

## జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



పాడేరు, (విశాఖ సమాచారమ్):- జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో ఔత్సాహికులైన యువతీ యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. రక్తదానంతో అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడ అవకాశం ఉన్నందున, రక్తదానం వల్ల ఎటువంటి నష్టం లేనందున అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడడానికి యువత ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ రక్తదాన శిబిరాలు 21వ తేదీ శుక్రవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, 22వ తేదీన శనివారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్నందున రక్త సేకరణ అత్యవసరంగా భావించి అత్యధిక మంది రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని అందించాలని సూచించారు.

# 22 నుండి కేజీబీవీల్లో ప్రవేశాల కోసం ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరణ

## కేజీబీవీ ఇంచార్జ్: బొడ్డు చిన్నమ్మలు



కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025 - 26 విద్యా సంవత్సరానికి గానూ 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8,9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కింతాడ పంచాయతీ శివారు గొల్లల పాలెం లో గల కేజీబీవీ ఇంచార్జ్ బొడ్డు చిన్నమ్మలు ఒక ప్రకటనలో బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఆన్ లైన్ దరఖాస్తులు మార్చి 22 నుండి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయని అన్నారు.

అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ, బి.పి.ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడతాయని తెలిపారు. ఈ దరఖాస్తు https://apkgbv.apcfss.in/ సైట్ ద్వారా పొందగలరు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని చెప్పారు. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడ వచ్చుఅన్నారు. ఏవైనా సమస్యలు, సందేహాలకు 70751 59996, 7075039990 నంబర్లు సంప్రదించాలని ఇన్చార్జి బొడ్డు చిన్నమ్మలు కోరారు.

# లక్ష్మీ గణపతి ఐదవ వార్షికోత్సవం





పరవాడ, (విశాఖ సమాచారమ్):- శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఐదవ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దానబోయిన అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. 79 వ వార్డు లంకెలపాలెం ఏడుమెట్ల మర్రిపాలెం బస్టాప్ వద్ద వెలసిన లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఉదయం 8 గంటల నుండి స్వామివారికి మహన్యాస పూర్వక పంచామృతాభిషేకం, లక్ష్మీ గణపతి హెూమం, నీరాజనం మంత్రపుష్ప అభిషేకములు నిర్వహించబడతాయని ఆయన తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నామని , ఉదయం 8 గంటల నుండి అగనంపూడి సత్యసాయిబాబా వారిచే లలిత పారాయణం మరియు భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కావున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పరవాడ, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో గల జాలారిపేట గ్రామం లో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.77 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నిబద్ధతతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న ,మాజీ ఎంపీటీసి చింతకాయల అమ్మోరు ,మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు , 1 వ వార్డు మెంబరు ఒలిశెట్టి పోల్లమ్మ ఒలిశెట్టి సత్యవతి, గ్రామ నాయకులు సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు ,కణితి చినసోమేష్,కంబాల గురువోజీ, సమ్మంగి అప్పలరాజు, కార్యదర్శి రజని, సచివాలయం సిబ్బంది దిలీప్ ,దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న పండుగకు వేళాయే...



అరకులోయ, (విశాఖ సమాచారమ్):- శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవాల తేదీలు... మే నెల 8 9 10 ఖరారు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ & ఆలయ కమిటీ ఈ కమిటీ మీటింగ్కి ప్రత్యేకంగా విచ్చేసిన అరకు టీడీపీ ఇంచార్జ్ అలాగే ఆర్టీసీ చైర్మన్ సివేరి ధోన్ను దొర, అలాగే పెదలబుడు మేజర్ పంచాయతీ డైనమిక్ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, సివేరి. బాల కృష్ణ, రేఘం. రాంబాబు, చిట్టీ. బాబు మాస్టర్, ఆనంద్ రావు, మాస్టర్ పద్మ పురం మేనేజర్ బొంజు బాబు అలాగే రాజకీయ ప్రముఖులు సమర్థి రఘు నాథ్, బాబురావు, అప్పన్న, కామేష్, దామోదర్ అప్పలరాం, బాలాజీ రమేష్, రామారావు అర్జున్, రాజు జగదీష్ మీడియా సోదరుల అధ్యక్షతన కమిటీ ని నియమించడం జరిగింది ఈ మీటింగ్ లో అధిక సంఖ్యలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు గడిచిన యాడా ది కన్నా మరింత ధీటుగా వెంకన్న ఉత్సవాలు జరపాలని కమిటీ తీర్మానించారు. రాజకీయాలకు అతీతంగా ఈ అందరూ బక్తి శ్రద్ధలతో పండగ జరపాలని కోరారు ఈ కార్యక్రమంలో రాజకీయ, వర్తక సంఘం ప్రముఖులు యువత, పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయు మద్ధతు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఈనెల 24-25 తేదీలలో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతును తెలియజేసింది.

దీర్ఘకాలంగా ఖాళీగా వున్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, టెంపరరీలను రెగ్యులర్ చేయాలని ద్వైపాక్షిక ఒప్పందాలకు తూట్లుపొడుస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ యు ఎఫ్ బి యు నాయకత్వంలో ఉద్యోగులు అధికారులు ఐక్యంగా సమ్మె తలపెట్టారు. ఫిక్స్, టర్మ్ ఉద్యోగులను ప్రవేశపెడుతున్నారు. ఉద్యోగ సంఘాల ఉనికినే ఈ పరిణామాలు సవాలు చేస్తున్నాయి. ఇటువంటి పరిణామాలు తీసుకొచ్చే లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన జాతీయ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ పోరాటంలో బ్యాంకు ఉద్యోగులు కూడా భాగస్వాములు కావాలని సిఐటియూ కోరుతుంది. నేడు మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రైవేటీకరణ విధానాలను ఎదుర్కొని ప్రభుత్వ రంగాన్ని కాపాడు కావలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. ప్రభుత్వ రంగం లేకపోతే ఉద్యోగులు, కార్మికులతో, పాటు ప్రజలు కూడా తీవ్రంగా నష్టపోతారు. అందుకే బ్యాంకు ఉద్యోగాలు చేస్తున్న పోరాటం న్యాయమైనది. ఈ సమ్మె నూటికి నూరు శాతం జయప్రదం కావాలని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ కోరుకుంటున్నట్లు అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రాష్ట్ర పురోగతి చంద్రబాబు కే సాధ్యం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోగతికి సాంకేతికతను ఉపయోగించుకోవడానికి మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కే సాధ్యమని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంటు మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు హర్షనీయమని అన్నారు. బిల్ గేట్స్ తో ఒప్పందం వల్ల ఆరోగ్య సంరక్షణ, మెడెటెక్, విద్య, వ్యవసాయం వంటి కీలక రంగాలలో ఆంధ్రప్రదేశ్ గేట్స్ ఫౌండేషన్ సహకరించనున్నదని ఆయా రంగాలలో ఖర్చు ఇతర పరిష్కారాలను సమగ్ర పరచడంతో ప్రజా సంక్షేమం కోసం సాంకేతికను ఉపయోగించడంలో చంద్రబాబు నాయుడు కే సాధ్యమని వెంకటరావు అన్నారు. బిల్ గేట్స్ ఒప్పందం వల్ల ప్రిడిక్టివ్ హెల్త్ అనలిటిక్స్ ఆటోమేటెడ్ డయాగ్నొటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ ) ఉపయోగించడం జరుగుతుందని ఏఐ ఆధారిత పాలన, మానవ మూలధనం అభివృద్ధి, ఆరోగ్యం, వ్యవసాయం, విద్యలో సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగించడంతో ఈ అవగాహన ఒప్పందం రాష్ట్రానికే నమూనాలను సృష్టించి ఫలితాలను సాధిస్తుందని వెంకటరావు అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి అన్ని రంగాల్లో కుదేలు చేశారని, ఇటువంటి విపత్కరమైన పరిస్థితుల్లో దార్శనికుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలివి తేటలతో ఐటి రంగంతో తనకున్న ప్రతిభతో రాష్ట్ర పురోగతికి చంద్రబాబు నాయుడు కీలకమయ్యారని ఇది ఆంధ్ర రాష్ట్ర ప్రజలు చేసుకున్న పుణ్యమని వెంకటరావు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ రాష్ట్ర పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

# 21 న ముత్యాలమ్మ అమ్మవారి జాతర కమిటీ సమావేశం



చింతపల్లి, (విశాఖ సమాచారమ్):- ఏజెన్సీవాసుల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ అమ్మవారి జాతర ను ఘనం గా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సన్నాహాలు చేస్తోంది.. ఈ మేరకు ఈ సమావేశం శుక్రవారం (21 వ తేదిన) జరగనుంది.కాగా తొలి రోజు బుధవారం ముహూర్తం గా స్థానిక మండలాధ్యక్షురాలు కోరాబు అనుషాదేవి, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత ఆధ్వర్యంలో గ్రామస్తులు,గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు సమావేశమయ్యారు..అయితే ప్రతి ఏటా ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా అమ్మవారి జాతర ను ఘనంగా జరుపుకునేందుకు, శుక్రవారం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం లో కమిటీ సమావేశం కానుంది. ఈ సందర్భం గా జాతర జరుపుకొనే తేదీలు కూడా ఈ సమావేశంలో నిర్ణయించనున్నట్లు ఎం.పి.పి. ,సర్పంచ్ లు తెలిపారు.. ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.

# విద్యుత్ మీటర్ రీడర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలి




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న, విద్యుత్ మీటర్ రీడర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలవారీ వేతనాలు అమలు చేయాలని కోరుతూ గురువారం గ్రీన్ పార్క్ హెూటల్ కు ఎదురుగా ఉన్న విద్యుత్తు శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుతరావు, సహాయ కార్యదర్శి ఎస్.కె రెహమాన్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, శివారెడ్డి మాట్లాడుతూ, విద్యుత్ సంస్థను నమ్ముకొని సుమారు 10 నుంచి 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్ ను, స్మార్ట్ మీటర్స్ వస్తున్న తరుణంలో తొలగింపుకు చర్యకు పూనుకోవటం సరికాదన్నారు. ఎందువల్ల మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. దీనిని గమనించి విద్యుత్ సంస్థలో వీరందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మీటర్ రీడర్స్ చేసిన ఆందోళన కారణంగా, సంబంధిత అధికారులు చర్చలు జరిపి నాలుగు అంశాలను అమలు చేయడానికి హామీ ఇచ్చారని చెప్పారు. స్మార్ట్ మీటర్లు వస్తే మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని చెప్పారన్నారు. మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా ప్రతినెల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. సిఎండిలు, ఎస్క్రో అకౌంట్లు అమలు చేయాలని ఆదేశించినప్పటికీ కిందిస్థాయి అధికారులు అమలు పరచటం లేదని ఆవేదన వెలిబుచ్చారు. మూడు కంపెనీల పరిధిలో ఒకే పని దినాలు అమలు చేయాలని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. 2019 తర్వాత మీటర్ రీడర్స్ కు ఒక్క పైసా కూడా వేతనం పెరగలేదు అన్నారు. పెంచేందుకు పరిశీలించి త్వరగా అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అది కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు ఆర్. కుమారస్వామి, ఎస్.శ్రీనివాసరావు, డి.క్రాంతి కుమార్, పి.నాగబాబు, ఓ.శ్రీనివాసరావు, బి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు ఎస్ఇకి వినతిపత్రం సమర్పించారు.

# ప్రతి బుధవారం నియోజకవర్గ ప్రజల నుండి గ్రీవెన్స్ స్వీకరించాలి

## ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం.

## జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాతయ్య బాబు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్చార్జు ప్రతి బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి గ్రీవెన్స్ తప్పనిసరిగా స్వీకరించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు నిర్వహించిన పత్రికా విలేఖరుల సమావేశంలో తెలియజేశారు. ప్రతి బుధవారం మధ్యాహ్నం నుంచి పార్టీ క్యాడర్ తో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించాలి. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం కార్యకర్తల సమస్యలు, ఫిర్యాదుల స్వీకరణ, పార్టీ సంస్థాగత నిర్మాణం, అన్ని విభాగాలలో కార్యక్రమాలు బాగా చేసిన వారిని అభినందించడం. మీటింగ్ అనంతరం మినిట్స్ కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపించాలి. ప్రతి నెల ఇన్చార్జ్ మంత్రులు తమకు కెటాయించిన జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించాలి. మొదటి రోజు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించాలి. రెండవ రోజు పార్లమెంట్ అధ్యక్షులు, జోనల్ కో ఆర్డినేటర్లతో కలిసి పార్టీ క్యాడర్ సమావేశం ఏర్పాటు చేయాలి. మీటింగ్ యొక్క మినిట్స్ కేంద్ర పార్టీ కార్యాలయంకు పంపించాలి. ఎవరైనా మీటింగ్స్ ను నిర్వహించని యెడల లిఖిత పూర్వక వివరణ ఇవ్వవలసి ఉంటుంది. ఏ ఎస్ ఎస్, సి యు బి కమిటీలు ఏప్రిల్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలి. గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు ఉన్న మెయిన్ కమిటీలు, అనుబంధ కమిటీలను ఏప్రిల్ 30వ తారీకు లోపల పూర్తి చేయాలని తాతయ్య బాబు తెలిపారు.

# సినీ నటుడు శోభన్ బాబుకు ఘన నివాళి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- పట్టణంలో గల విజయరామరాజుపేటలో ఆంధ్రుల అందాల నటుడు శోభన్ బాబు 17 వర్ధంతి వేడుకలు శోభన్ బాబు వీరాభిమాన శోభన్ బాబు ఫ్యాన్స్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ముందుగా శోభన్ బాబు చిత్రపటానికి.

విజయరామరాజుపేటపంచాయతీపెద్దలుపగ్గాలమాలవేసి ఘనంగానివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో. పలకా రాము, పలకా సత్యనారాయణ,పిట్ల బుద్దేశ్వరరావు, బొబ్బిలి అప్పారావు, బొబ్బిలి గోవింద్, ఒమ్మి రాము, పళ్ళ సత్యఅప్పారావు, అప్పికొండ ప్రసాద్, పిఇల్లపురెడ్డి , విత్తనాల పోతురాజు, లాయర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ సీఎం రమేష్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** లండన్ హౌస్ ఆఫ్ కామన్స్ యూకే పార్లమెంట్లో లైఫ్ టైమ్ అచీవ్మెంట్ పురస్కారాన్ని అందుకున్న మెగాస్టార్ చిరంజీవి కి రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ శుభాకాంక్షలు తెలియజేసారు.బ్రిటన్ ప్రభుత్వం నుంచి జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న తొలి భారతీయ నటుడిగా చిరంజీవి గారి రికార్డు మన తెలుగు వారికే గర్వకారణం అని పేర్కొన్నారు. యూకేకు చెందిన అధికార లేబర్ పార్టీ పార్లమెంట్ మెంబర్ నవేందు మిశ్రా గారి చేతులు మీదుగా చిరంజీవి కి జరిగిన సన్మానం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.నాలుగున్నర దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తు ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్న చిరంజీవి కి ఈ పురస్కారం వారి కీర్తిని మరింత పెంచిందన్నారు.కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో చిరంజీవి భవిష్యత్ లో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకొని ఎల్లప్పుడూ చిరంజీవిగా ఉండాలని కోరుకున్నారు.

## ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటిని కలిసిన జనసేన 80వార్డ్ ఇంచార్జ్ మళ్ల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఏపీ టీడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ ను అనకాపల్లి జీవీఎంసీ 80 వార్డు జనసేన ఇంచార్జ్ మళ్ల శ్రీను మర్యాదపూర్వక%శీ%గా కలిసారు. అనకాపల్లి కొణతాల రామకృష్ణ లాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా పనిచేయడం అనకాపల్లి ప్రజలు చేసుకున్న అదృష్టమని ఆయన అనతి కాలంలోనే అనకాపల్లికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని అనకాపల్లి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడం,రోడ్లు నిర్మాణం, కాలువ నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ కార్యక్రమం జరిగాయన్నారు. అదే విధంగాఎమ్మెల్యే కొణతాల చొరవ వల్లే ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అనకాపల్లి నూకాలమ్మ పండుగను రాష్ట్ర పండగ చేయడం వల్ల అనకాపల్లి పేరు రాష్ట్రవ్యాప్తంగా వినిపించేలా చేసిన గొప్ప వ్యక్తి కొణతాల రామకృష్ణ అని ఆయన ద్వారా అనకాపల్లి రానున్న రోజుల్లో అభివృద్ధి పథంలో పరుగులు తీస్తుందని కార్యకర్తలు బాగోగులు చూసుకుంటూ ప్రతి ఒక్కరిని సమన్వయం చేస్తున్న గొప్ప లీడర్ కొణతాల. రామకృష్ణ అని తెలియజేసారు.

అదే విధంగా అజయ్ కుమార్ ని అనకాపల్లి టిడ్కో గృహాల ను కొణతాల అధ్యక్షతన సందర్శించాలని మళ్ల శ్రీను కోరారు.

వేములపాటి విజయకుమార్ తో పాటు ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ పంచకర్ల సందీప్ కూడా ఉన్నారు

## సీపీఐ పరిరక్షణ పోరాట కమిటీ యాత్ర



**కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):-** గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరి రక్షణ పోరాట కమిటీ పిలుపుమేరకు యాత్ర భాగంగా మేడిచర్ల, రొంగల నాయుడుపాలెం, పైడం పేట, మల్లం పాలెం, చౌడువాడ, గుల్లిపెల్లి, గోండు పాలెం, గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కోశాధికారి, గండి నాయన బాబు, మరియు మండల ప్రజా సంఘాలు కన్వీనర్ ఎర్ర దేవుడు శుక్రవారం ఉదయం 10 గంటలకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ దగ్గర జరుగు మహాధర్నాలను చెరుకు రైతులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నారు, ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మన షుగర్ ఫ్యాక్టరీని, మనమే కాపాడుకోవాలని, నష్టాలు పేరు చెప్పి కారు చవకగా కొట్టేయడానికి కూటమి ప్రభుత్వం పెద్దలు గెద్దలు లాగా చూస్తున్నారని, చెరుకు బకాయిలు 35 కోట్లు వెంటనే చెల్లించాలని, ప్రస్తుతం మరమ్మతులకు వెంటనే28కోట్లు, ఫ్యాక్టరీ ఆధునీకరణకు 350 కోట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, ఆయన డిమాండ్ చేశారు, ఎన్నికి ముందు సీఎం రమేష్ గారు నాకు ప్రధాని మోడీ వద్ద బాగా పలుకుబడి ఉంది దాని వలన 200 కోట్లు తీసుకొస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు కనబడలేదు. మాడుగుల చోడవరం ఎమ్మెల్యేలు ఈ మధ్యకాలంలో జరుగు అసెంబ్లీ సమావేశాల్లో మన ఫ్యాక్టరీ ఆధునీకరణ గురించి గానీ చెరుకు బకాయిల గురించి గానీ నోరు మెదపకుండా రైతులు అన్యాయం చేశారు ఈ ప్రాంత ప్రజానికం ఓట్లు వేసి గెలిపించినందుకు ప్రజలకు బాగా బుద్ధి చెప్పారు. మన సుగర్ ఫ్యాక్టరీని కాపాడుకొనుటకు చెరుకు రైతుల అందరూ 21న జరుగు మహాధర్నాని జయప్రద చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకు రైతులు ఎస్ రామనాయుడు, పైల ముత్యాల నాయుడు, బందారు ముచ్చపాత్రుడు, బండారి వెంకన్న పాత్రుడు, డొక్కా ముత్యాల నాయుడు, బి. లచ్చన్న పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యం

## జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్



**పాడేరు, (విశాఖ సమాచారమ్):-** నాటు సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నుండి నాటు సారా నివారణపై రెవెన్యూ, అటవీశాఖ, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నాటు సారా తయారీ దారులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని సూచించారు. నాటు సారా నివారణకు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని తెలియజేసారు. గ్రామ మండల స్థాయి, డివిజన్ స్థాయిలో ప్రత్యేకాధికారులను నియమిస్తామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నాటు సారా నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. తయారీ దారులు గ్రామస్తులు నివారణకు సహకరించకపోతే నాటు సారా తయారు చేసే గ్రామాలకు ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని గ్రామస్తులకు వివరించాలన్నారు. సారా తయారీని విడిచి పెట్టిన తయారీ దారులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. బెల్లం సరఫరా దారులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. సారా తాయారు చేసే గ్రామాలను ఎ. కేటగిరీగాను, తాయారీ, పంపిణీ చేసే గ్రామాలను బి కేటగిరీ గ్రామాలుగాను, సారా వినియోగించే గ్రామాలను సి కేటగిరీగాను విభజించాలన్నారు. అటువంటి గ్రామాలపై దాడులు చేసి నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. నాటు సారా వినియోగంపై కలిగే నష్టాలను చెడు ప్రభావాన్ని వినియోగదారులకు వివరించాలన్నారు. గ్రామాలలో పూర్తి స్థాయిలో సారా తాయారీ, వినియోగం లేదని అధికారులు చర్చించి సారా రహిత గ్రామంగా ప్రకటించాలని చెప్పారు. సారా తయారీపై 14405 టోల్ ఫ్రీ సంబరుకు సమాచారం అందించాలన్నారు.

అనంతరం నవోదయం ప్రచార రథాన్ని ప్రారంభించారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ గంజాయి మాదిరిగానే నాటు సారా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. సారా తయారీ చేసే కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు.

ఈ కార్య క్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్. సుజిత్ సింగ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ పి.నాగ రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజని. ఎక్సైజ్ ఎస్ ఐలు, పర్చువల్గా రంపచోడవరం వె ఓ కె. సింహచలం, పాడేరు ఐటిడి ఏ ఇన్చార్జి పి ఓ, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, చింతూరు పి. ఓ అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ జిల్లా పంచాయతీ అధికారి బి. లవరాజు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి. ఎస్. కుమార్, డివిజనల్ ఫారెస్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ భారతి స్కూల్ నందు సిల్వర్ జూబ్లీ




**కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):-** తూర్పు గోదావరి జిల్లా ధర్మవరంలో స్వర్ణ భారతి స్కూల్ నందు సిల్వర్ జూబ్లీ కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించారు. 25 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థులకు ఉత్తమ ఫలితాలను అందించి వారి అభివృద్ధికి సహకరించిన మా ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలుపుతూ. అలాగే మా ఎదుగుదలకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని స్కూలు కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు ఆనందాన్ని వ్యక్తం చేశారు. స్కూల్ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. మొదటి రెండు రోజుల కార్యక్రమంలో మార్చి 17 వ తేదీన నర్సరీ, సెకండ్ క్లాస్ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు, మార్చి 19 వ తేదీన 3,4,5. తరగతుల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తిలకించారు. విద్యార్థుల నృత్యాలు అత్యద్భుతంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో స్వర్ణ భారతి స్కూల్ వ్యవస్థాపకులు పేరిచర్ల సూర్యనారాయణ రాజు, తెలుగుదేశం నాయకులు మద్దుకురి శ్రీనివాసరావు, సామాజికవేత్త నేరేడుమిల్లి నాగేశ్వరరావు, లీడ్ స్మార్ట్ కరి కులం ఆఫీసర్స్ పద్మ శ్రీత, త్రినాధ్, నవీన్, ప్రముఖ విద్యావేత్త కే.కే. ఎంఎల్. ప్రసాద్ స్కూల్ అభివృద్ధిని కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

# గంటల వ్యవధిలో హిజ్రా హత్య కేసు చేధింపు




## నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందన

**కశింకోట, (విశాఖ సమాచారమ్):-** సంచలనం సృష్టించిన హిజ్రా కేసులో గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేసి నట్లు జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా గురువారం పత్రిక సమావేశంలో తెలియజేశారు. తేదీ. 18.03.2025 న, వీఆర్ఓ నుండి సమాచారం తీసుకున్న ఎస్ హెచ్ ఓ, కశింకోట పోలీస్ స్టేషన్ మరియు అతని బృందం కలిసి బయ్యవరం గ్రామంలోని అండర్ బ్రిడ్జ్ వద్దకు వెళ్ళారు. అక్కడ వారు ఒక మహిళ యొక్క నడుము నుండి కింద భాగం మరియు ఆమె కుడి చేయి కనుగొన్నారు. అనకాపల్లి డీఎస్పీ శ్రీమతి శ్రావణి మరియు ఇతర సీనియర్ అధికారులు పై విషయం తెలిసిన గంటలో సంఘటనా స్థలాన్ని సందర్శించి సదరు నేర స్థలం వివరంగా పరిశీలన చేసినప్పుడు అది మహిళా శరీరం అని, ఆమె చేతి గాజులు, కాళ్ళ మెట్లు, మరియు ఒక టాటూ గుర్తు ఉన్నట్లు గుర్తించారు. తదుపరి పై విషయమై పోలీస్ శాఖ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయగా సదరు శవంను దీపు అలియాస్ దిలీప్ కుమార్ (వయస్సు సుమారుగా 35 సంవత్సరాలు), ట్రాన్స్జెండర్ గా గుర్తించినారు. తరువాత, విచారణలో హత్య చేసిన నిందితుడు దుర్గ ప్రసాద్ అలియాస్ బన్ని గా నిర్ధారించారు. బన్ని మరణించిన దీపు తో గత నాలుగు సంవత్సరాలుగా సంబంధంలో ఉన్నాడు మరియు మృతురాలి క్యారెక్టర్ పై అనుమానం ఉండి మరియు నిందితుడు రెండవ వివాహం చేసుకోవాలనే ఉద్దేశ్యం కూడా ఉండి, మృతురాలి ఆభరణాలు కూడా పొందాలనే ఆశతో ఆమెను క్రూరంగా చంపి, అనంతరం ఆమెను ముక్కలుగా కోసాడు. మరణించిన వ్యక్తి అన్ని శరీర ముక్కలను పోలీసులు క్షణాల్లో ఛేదించారు. నిందితుడు 19.03.2025న సాయంత్రం 18:30 గంటలకు కశింకోట మండలంలోని విసన్నపేట గ్రామం వద్ద పట్టుబడ్డాడు.

**నేర ఉద్దేశం**

మృతురాలి లక్షణంపై అనుమానం, నిందితుడి రెండవ వివాహం ఉద్దేశ్యం తో, మృతురాలి ఆభరణాలు కోసం హత్య చేసినట్లు తెలిపారు. అతను వద్ద నుంచి మృతురాలి మరియు నిందితుడి సెల్ ఫోన్లు, సంఘటన స్థలంలో నుండి నిందితుడి డబ్బు మరియు బట్టలు,మృతురాలి ఆభరణాలు స్వాధీన పరుచుకున్నరని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ దురదృష్టకర ఘటనలో హత్యకు గురైన దీపు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే హిజ్రా సమాజానికి నిందితుడికి కఠిన శిక్షల పడేవిధంగా పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కేసులో సీనియర్ పోలీస్ అధికారులు సూచనలు సలహాలతో, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీమతి శ్రావణి ఆధ్వర్యంలో పోలీసులు 8 బృందాలుగా ఏర్పడి గంటల వ్యవధిలోనే సంచలనం సృష్టించిన హత్య కేసును చేధించాయని, 8 దర్యాప్తు బృందాలను, సీసీటీవీ కెమెరాలు, టవర్ డంప్, క్లూస్ టీం, కల్వర్టులు, నిందితుడిని అరెస్ట్ చేసిన బృందాన్ని ఈ కేసు దర్యాప్తులో భాగం పంచుకున్న అధికారులను అభినందించారు.ఈ మీడియా సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి, కసింకోట ఇన్స్పెక్టర్ ఏ.స్వామి నాయుడు, ఎస్సైలు లక్ష్మణరావు, మనోజ్ కుమార్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్బిఎం న్యాయ విద్యార్థులు విశాఖ కేంద్ర కారాగారం సందర్శన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఎన్బిఎం న్యాయ కళాశాల డీన్ బి వి రమణ గారు,ప్రిన్సిపాల్ గాయిత్రి గారు, వైస్ ప్రిన్సిపల్ సాగర్ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం విశాఖపట్నం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు.అయితే ముఖ్యంగా ఎన్బిఎం న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాగర్ పర్యవేక్షణలో అరిలోవ కేంద్ర కారాగార అధికారుల సమన్వయంతో చివరి సంవత్సరం చదువుతున్న న్యాయ విద్యార్థులకు జైళ్ల శాఖ చట్టాలు, ఖైదీలకు అందిస్తున్న సదు పాయాలు, ఏ నేరానికి ఏ శిక్ష విధించారు. ఖైదీల్లో మార్పు తేవడానికి అనుసరిస్తున్న విధానాల గురించి కారాగారం పర్యవేక్షణాధి కారి ఎం. మహేష్ బాబు వివరించారు.

న్యాయ విద్యార్థులకు జైలు చట్టాల గురించి ఎం.మహేష్ బాబు వివరించారు. న్యాయ విచారణ పూర్తయిన తరువాత శిక్ష అనుభ విస్తున్న పేద ఖైదీలకు న్యాయ సహాయం అందించాలని కోరారు. కారాగారం ఉప పర్య వేక్షణాధికారులు పాల్గొన్నారు.అలాగే ఈ సందర్శన లో చివరి సంవత్సరం చదువుతున్న వేణుగోపాలరావు, శ్రీనివాసరావు, ముఖుంద్, ప్రకాశ్, జ్యోత్స్న,మాధవి తదితరులు ఉన్నారు.

# యువ గేమర్లకు గోల్డెన్ చాన్స్

- ఐక్యూ సీజీఓ కోసం దరఖాస్తుల ఆహ్వానం
- రూ. 10 లక్షల భారీ పారితోషికం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** యువ గేమర్లకు ఇది గోల్డెన్ చాన్స్ అని చెప్పవచ్చు. హై-పర్ఫార్మెన్స్ స్మార్ట్ఫోన్ బ్రాండ్ ఐక్యూ 2025 సంవత్సరానికి తన చీఫ్ గేమింగ్ ఆఫీసర్ (సీజీఓ) కోసం వెతుకుతుంది. ఈ సందర్భంగా ఐక్యూ సీఈఓ నిపున్ మర్యా మాట్లాడుతూ యువ గేమర్లకు ఇది గొప్ప అవకాశం అన్నారు. ఈ అవకాశం పొందాలంటే గేమింగ్ పై అభిరుచి, 25 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఈ చీఫ్ గేమింగ్ ఆఫీసర్ బాధ్యతలలో ప్రధానంగా ఐక్యూ కొత్త స్మార్ట్ఫోన్ల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం, బ్రాండ్ ఈస్పోర్ట్ వ్యూహాన్ని నడిపించడం, భారతదేశంలోని టాప్ ఈస్పోర్ట్స్ గేమర్లతో చురుకుగా వ్యవహరించడం ఉన్నాయన్నారు. ఈ రోల్ ద్వారా సీజీఓ ఐక్యూ తాజా ఉత్పత్తులకు యాక్సెస్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే ప్రముఖ గేమింగ్ ఈవెంట్లలో బ్రాండ్కు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. ఐక్యూ చీఫ్ గేమింగ్ ఆఫీసర్ నాయకత్వ బృందంతో కలిసి పని చేస్తూ.. గేమింగ్ కమ్యూనిటీతో అనుసంధానం చేసి గేమ్ప్లే, గేమింగ్ స్టైల్, ప్రదర్శన, గేమ్ విశ్లేషణలపై విలువైన సమాచారాన్ని పంచుకునే అవకాశం పొందుతారన్నారు. ఐక్యూ తన సీజీఓకి రూ.10 లక్షలు అందిస్తుందని పేర్కొన్నారు. యువ గేమింగ్ అభిమాన్లు ఐక్యూ అధికారిక వెబ్సైట్ (www.iqoo.com/in/activity/cgo) ద్వారా మార్చి 30, 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భారతదేశ గేమింగ్ కమ్యూనిటీ శక్తిని నమ్ముతున్నామన్నారు. మా గత సీజీఓకు అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. మా కమ్యూనిటీ నుంచి అనేక అభ్యర్థనలు వచ్చిన తర్వాత దీన్ని తిరిగి ప్రారంభించాల్సిందేనని నిశ్చయించామన్నారు.

## భీమవరంలో హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్ వారిచే హెచ్ఎపి డైలీ అవుట్లెట్ ప్రారంభం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** హట్సన్ ఆగ్రో ప్రోడక్ట్ లిమిటెడ్, భారతదేశపు ప్రముఖ ప్రైవేట్ రంగం డైరీ కంపెనీ నేడు భీమవరం, ఆంధ్రప్రదేశ్లో 4000వ హెచ్ఎపి డైలీ అవుట్ లెట్ ను ప్రారంభించింది. వినియోగదారులకు నేరుగా ఉన్నతమైన నాణ్యత మరియు తాజాదనం గల డైరీ ఉత్పత్తులను అందచేయడంలో కంపెనీ వారి నిబద్ధతను ఈ ముఖ్యమైన విజయం సూచిస్తోంది.

హెచ్ఎపి డైలీ ఎక్స్క్లూజివ్ స్టోర్స్ కంపెనీ యొక్క రీటైల్ విస్తరణ వ్యూహంలో భాగంగా ఉంది. అరుణ్ ఐస్ క్రీమ్లు, ఆరోక్య, మరియు హనోబర్ సహా విస్తృత శ్రేణి బ్రాండ్స్ను అందిస్తుంది. ఈ స్టోర్స్ ఐస్ క్రీమ్లు, తాజా పాలు, పెరుగు, మజ్జిక, పనీర్, యోగర్ట్, చాకొలెట్స్, జ్యూసెస్, వెన్న మరియు ఇంకా ఎన్నింటినో విక్రయిస్తుంది. ప్రత్యక్ష వినియోగదారు సేల్ మాత్రమే కాకుండా, హెచ్ఎపి డైలీ అవుట్లెట్స్ తమకు సమీపంలో ఉన్న రీటైల్ అవుట్లెట్స్కు కూడా సరఫరా చేస్తాయి మరియు ఉత్పత్తుల లభ్యతను పెంచుతాయి మరియు బ్రాండ్ అందరికీ చేరుకోవడాన్ని విస్తరిస్తాయి.

4000వ హెచ్ఎపి డైలీ అవుట్లెట్ ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, శ్రీ. ఆర్.జి. చంద్రమోగన్, ఛైర్మన్, హట్సన్ ఆగ్రో ప్రోడక్ట్ లిమిటెడ్, ఇలా అన్నారు, "తాజా, ఉన్నతమైన నాణ్యత గల డైరీ ఉత్పత్తులను వినియోగదారులకు సన్నిహితంగా తీసుకురావడానికి భీమవరం, ఆంధ్రప్రదేశ్లో మా 4000వ హెచ్ఎపి డైలీ ఎక్స్క్లూజివ్ స్టోర్ ప్రారంభోత్సవం అనేది కంపెనీ వారి ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి. హట్సన్ ఆగ్రో వారు వినూత్నత, నాణ్యతల పైన ఎల్లప్పుడూ దృష్టి కేంద్రీకరిస్తారు మరియు డైరీ రైతులు మరియు ఫ్రాంఛైజీ భాగస్వాముల కోసం కొత్త అవకాశాలను సృష్టించే సమయంలో అందుబాటులో ఉంచడాన్ని నిర్ధారిస్తారు.

## ఎస్సీ రెల్లి కులానికి ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించాలి



**కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):-** కే కోటపాడు రెల్లి వీధిలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షులు వడ్డాది కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఎస్సీ రెల్లి కులానికి ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించాలని ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులాస్తులకు తీరని అన్యాయం జరిగింది అన్నారు, ఎస్సీ వర్గీకరణ ద్వారా అయినా అన్ని రంగాల్లో అణగారిన రెల్లి కులానికి ఐదు శాతం రిజర్వేషన్ వాటా పెంచి సామాజిక సమన్యాయం చేస్తారని ఆశిస్తే ఒక శాతం మాత్రమే కేటాయించి అన్యాయం చేశారని వర్గీకరణ కమిషన్ మంత్రులు కమిటీ, మరోసారి పునరాలోచన చేసి రెల్లిలకు ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించాలని , మాలలకు 6.5% మాదిగలకు 7.5% రిజర్వేషన్ కేటాయించి అభివృద్ధి నోచుకుని రెల్లిలకు 1 శాతం రిజర్వేషన్ మాత్రమే కేటాయించడం అన్యాయమని తమకు న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు సేపడతామని కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతి కోటేశ్వరరావు భూపతి త్రినాధ్ భూపతి అప్పలరాజు, వడ్డాది శ్రీను, వడ్డాది నరసింహమూర్తి, భూపతి గణేష్, భూపతి మోహన్ రావు, కోటయ్య పాల్గొన్నారు.

# క్రీడా సమాచారమ్

## టీమ్ఇండియాకు బీసీసీఐ భారీ నజరానా



ఇంటర్నెట్ డెస్క్: దాదాపు 12 ఏళ్ల తర్వాత టీమ్ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి కప్‌ను సొంతం చేసుకుంది. అద్భుతమైన ప్రదర్శన చేసిన భారత జట్టుకు బీసీసీఐ కూడా భారీ నజరానాను ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటనను బీసీసీఐ జారీ చేసింది. జట్టు సభ్యులకు రూ.58 కోట్లను క్యాష్ రివార్డుగా అందించనుంది.

"రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత జట్టు టోర్నీ ఆసాంతం ఆధిపత్యం ప్రదర్శించింది. ఒక్క ఓటమి లేకుండా కప్‌ను సొంతం చేసుకుంది. బంగ్లాదేశ్‌తో విజయం సాధించి ట్రోఫీని ఘనంగా ప్రారంభించిన టీమ్ఇండియా.. పాకిస్థాన్, న్యూజిలాండ్ కూడా చిత్తు చేసింది. ఇక సెమీస్‌లో ఆస్ట్రేలియాను మట్టి కరిపించి ఫైనల్‌కు చేరుకుంది. అక్కడా కివీస్‌ను ఓడించి కప్‌ను సొంతం చేసుకుంది. వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలను దక్కించుకున్న టీమ్ఇండియా ఆటగాళ్ల నిబద్ధతను బోర్డు గుర్తించకుండా ఉండదు. వారి శ్రమకు ఈ క్యాష్ ప్రైజ్‌ను అందిస్తుంది. ఆటగాళ్లు, సపోర్ట్ సిబ్బందికి నజరానా ప్రకటించడం ఆనందంగా ఉంది. దీనికి వారంతా అర్హులే. అంతర్జాతీయ వేదికపై భారత క్రికెట్ ఉన్నతస్థానాలకు దూసుకెళ్తోంది" అని బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు.

విజేతగా నిలిచిన భారత్‌కు రూ.19.50 కోట్ల వరకు ఐసీసీ నుంచి ప్రైజ్‌మనీ లభించిన సంగతి తెలిసిందే. ఫైనల్‌లో ఓటమి పాలైన కివీస్‌కు రూ.9.70 కోట్ల వరకు దక్కాయి. రోహిత్ శర్మ నాయకత్వంలో భారత్ వరుసగా ఏడాది వ్యవధిలో రెండో ఐసీసీ టైటిల్‌ను గెలుచుకోవడం గమనార్హం.

## హార్దిక్ మానసిక క్షోభ అనుభవించాడు

### బయోపిక్ తీయొచ్చు: కైఫ్



ఇంటర్నెట్ డెస్క్: సరిగ్గా ఏడాది కిందట గత ఐపీఎల్ సందర్భంగా భారత క్రికెటర్ హార్దిక్ పాండ్య పై తీవ్ర విమర్శలు రేగాయి. తమ అభిమాన క్రికెటర్ రోహిత్‌ను కాదని.. ముంబయి ఇండియన్స్ సారథ్య బాధ్యతలను పాండ్యకు అప్పగించడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాచుల సమయంలో హార్దిక్‌ను హేళన చేస్తూ కవ్వించారు. అయినా, ఎక్కడా నోరు జారకుండా ముందుకుసాగాడు. తన ఆటతీరుతోనే టీమ్ఇండియాలో తానెంత కీలక ఆటగాడినో నిరూపించాడు. విమర్శలు చేసినవారే ప్రశంసించేలా పాండ్య ఎదిగాడు. ముంబయి జట్టు తరఫున హార్దిక్ పాండ్య ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనూ చాలా హుందాగా మాట్లాడాడు. ఒక్క ఏడాదిలోనే రెండు దశలను చూసిన పాండ్య జీవితాన్ని తప్పకుండా బయోపిక్ లేదా డాక్యుమెంటరీ తీయొచ్చని భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ వ్యాఖ్యానించాడు.

"ఎంత బాధ కలిగినా దానిని తనలోనే ఉంచుకొన్నాడు. బయట ఏమనుకున్నా పట్టించుకోకుండా ముందుకుసాగాడు. గొప్పగా సత్తా చాటి కమ్‌బ్యాక్ ఇచ్చాడు. ఈ క్రమంలో కొన్ని రోజులు అతడి ప్రయాణం దారుణంగా ఉంది. ప్రేక్షకుల నుంచి హేళనలు ఎదుర్కొన్నాడు. అతడిని తక్కువ చేసి సోషల్ మీడియాలో తమకు ఇష్టం వచ్చినట్లు రాసేశారు. ఎన్నో అవమానాలు బాధించినా ప్లేయర్‌గా ముందుకుసాగాడు. ఆటగాడు ఎప్పుడూ వాటిని మరిచిపోలేదు. అతడిని పక్కనపెట్టినా ఫర్వాలేదు. కానీ, అవమానించడం మాత్రం సరైంది కాదు. మానసికంగా చాలా క్షోభ అనుభవించాడు. అలాంటి పరిస్థితుల్లోనూ టీ20 ప్రపంచకప్‌లో సత్తా చాటాడు. ఫైనల్‌లో దక్షిణాఫ్రికా డేంజరస్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్‌ను ఔట్ చేశాడు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ సెమీ ఫైనల్‌లో జంపా బౌలింగ్‌లో కొట్టిన రెండు సిక్స్‌లు ఎంత విలువైనవో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. బ్యాట్‌తోపాటు బంతితోనూ సింహంలా పోరాడాడు. అతడిపై ఏదైనా బయోపిక్ తీయాలనుకుంటే మాత్రం గత ఏడు నెలలు ఒకెత్తు.. అంతకుముందు ఐపీఎల్ సమయంలో జరిగిన సంఘటనలు మరో ఎత్తు. తన బలాలను నమ్ముకొని నిశ్శబ్దంగా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు" అని కైఫ్ వెల్లడించాడు.

**పాండ్యతో జాగ్రత్త..**

"ఐపీఎల్ 2025 సీజన్‌లో హార్దిక్ పాండ్యతో ప్రత్యర్థులు జాగ్రత్తగా ఉండాలి. తప్పకుండా ముంబయి టాప్-4లోకి వస్తుంది. అభిమానులు మళ్లీ పాండ్యకు సపోర్ట్ ఇవ్వాలి. రోహిత్ అతడికి అండగా నిలవాలి. పాండ్య తన పేలవ దశ నుంచి బయటపడ్డాడు. భారత్ రెండు కప్‌లను సాధించడంలోనూ కీలక పాత్ర పోషించాడు. కష్టాలను ఎదురొడ్డి పోరాడటం నిజంగా అభినందనీయం" అని కైఫ్ ప్రశంసించాడు.

## ఇప్పటికీ అతడే వేగవంతమైన వికెట్ కీపర్

### - రాబిన్ ఉతప్ప



ఇంటర్నెట్ డెస్క్: చెన్నై సూపర్ కింగ్స్‌కు ధోనీనే బలం. అతడు జట్టులో ఉంటే చాలు ప్రత్యర్థులకు వణుకు పుడుతుంది. ఏడు లేదా ఎనిమిదో స్థానంలో వచ్చినా అతడి ప్రభావం భారీగానే ఉంటుంది. ఎంఎస్ ధోనీ ఈసారి ఐపీఎల్‌లో బ్యాటింగ్ వరుసలో కాస్త ముందుకురావాలని ఇప్పటికే భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సూచించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో మాజీ సహచరుడు రాబిన్ ఉతప్ప కూడా ఇదే విషయంపై స్పందించాడు. అదేవిధంగా ఇప్పటికీ వికెట్ల వెనక వేగవంతమైన కీపర్ కూడా ధోనీనేనని ప్రశంసించాడు. 43 ఏళ్ల మాహీ భాయ్ ఆఖర్లో బ్యాటింగ్‌కు వచ్చి కనీసం 12 బంతులు ఎదుర్కొంటే చాలని ఉతప్ప వ్యాఖ్యానించాడు.


"ధోనీ విషయానికొస్తే ఈసారి సీజన్‌లో అతడి బ్యాట్ నుంచి మరిన్ని బౌండరీలు చూస్తామని అనుకుంటున్నా. గతేడాది 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈసారి కూడా అలానే రావచ్చు. ఏడో స్థానంలో వస్తే ఇంకాస్త బెటర్. ధోనీ కనీసం 12 బంతులు ఆడితే స్కోరు దూసుకుపోతుంది. ధోనీలో ఇప్పటికీ ఆటపట్ల ప్రేమ అలానే ఉంది. వికెట్ల వెనక అత్యంత వేగవంతమైన కీపింగ్ గ్లౌవ్స్ అతడివే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ నైపుణ్యాలతో ఎంత కాలమైనా ఆడొచ్చు. అయితే, ఈ సీజన్ ముగిసిన తర్వాత వీడ్కోలు పలికినా ఆశ్చర్యపోను. అలాగే మరో నాలుగు ఎడిషన్లు ఆడినా ఆశ్చర్చపోనక్కర్లేదు" అని వ్యాఖ్యానించాడు.

వారికి ఇది అద్భుతమైన సీజన్ అవుతుంది

"భారత స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకిది మంచి సీజన్ అవుతుందని భావిస్తున్నా. ఇప్పుడు విరాట్ ఫామ్‌లోనే ఉన్నాడు. బెంగళూరులో ఎప్పుడూ అతడు ప్రమాదకరమే. ఇక రోహిత్ కూడా అంతర్జాతీయ క్రికెట్‌తో సంబంధం లేకుండా ఐపీఎల్‌లో డేంజరస్ బ్యాటర్. గతం ఎలాఉన్నా సరే.. ఈసారి సీజన్ మాత్రం వీరికి తప్పకుండా గుర్తుండిపోతుంది. ఆర్సీబీ సారథిగా రజత్ పటీదార్, దిల్లీ కెప్టెన్‌గా అక్షర్ పటేల్ అందరికీ తెలిసినవారే. కోహ్లీ సూపర్‌స్టార్‌డమ్ నుంచి రజత్ బయటపడి జట్టును నడిపించాలి. దిల్లీ, బెంగళూరు మైదానాలు చాలా చిన్నవిగా ఉంటాయి. అక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా కొత్త సారథులు నిర్ణయాలు తీసుకోవాలి" అని రాబిన్ ఉతప్ప వెల్లడించాడు.

## యూపీఐ మోసాలకు చెక్

- చెల్లింపు కోసం మొబైల్‌కు రిక్వెస్ట్ పంపే పద్ధతికి స్వస్తి
- చురుకుగా పరిశీలిస్తున్న ఎన్‌పీసీఐ




హైదరాబాద్: డిజిటల్ చెల్లింపుల్లో ముఖ్యంగా యూపీఐ విధానంలో మోసాలను అరికట్టేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) ద్వారా జరిగే లావాదేవీల్లో కొన్ని మార్పులు చేసేందుకు యోచిస్తోంది. ఇందులో భాగంగానే, వినియోగదారుల నుంచి వ్యాపారులు డబ్బు వసూలు చేసుకునేందుకు అమల్లో ఉన్న 'కలెక్ట్/పుల్ రిక్వెస్ట్' పద్ధతిని దశలవారీగా నిలిపి వేయాలని యోచిస్తోంది. ఈ విషయమై బ్యాంకులు, సంబంధిత భాగస్వాములతో ఎన్‌పీసీఐ చర్చలు నిర్వహిస్తోంది.

ఏమిటిది?: మీరు ఒక దుకాణానికి వెళ్లారనుకోండి.. అక్కడ కొనుగోళ్లు పూర్తి చేశాక, బిల్లింగ్ చేసే వ్యక్తి యూపీఐతో అనుసంధానమైన మీ ఫోన్ నంబరు అడుగుతారు. మీరు చెప్పిన యూపీఐ యాప్‌లోకి లేదా సంక్షిప్త సందేశం రూపంలో ఆ మొత్తాన్ని చెల్లించేందుకు వీలుగా 'కలెక్ట్ /పుల్ రిక్వెస్ట్' పంపిస్తారు.

## గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై 21 న మహాధర్నా పై కరపత్రాలు పంపిణీ



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై 21 న మహాధర్నా రైతులు కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం సభ్యులు ఎస్. వి నాయుడు మండల అధ్యక్షులు పినపాత్రని సాంబ శివరావు పిలుపి నిచ్చారు. గురువారం ఈ సందర్భంగా వారు వడ్డాది, బంగారుమెట్ట,, విజయరామరాజుపేట తది తర గ్రామాల్లో కర పత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కాపాడుకుందాం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ పిలుపుని జయప్రదం చేయాలని అన్నారు. బుచ్చయ్య పేట మండలం వడ్డాది చెరుకు కాటా వద్ద రైతులతో మాట్లాడి రైతు కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు ఇద్దరు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుంది గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల బకాయిల చెల్లించాలని, ప్రభుత్వం ఫ్యాక్టరీ ఆధునికరణ కై నిధులు కేటాయించి ఆదుకోవాలని, తక్షణమే ఫ్యాక్టరీ రిపేర్లకు 35 కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీని ఇక్కడ రైతాంగం ప్రజలు కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. దీని కోసమే ఈనెల 21 న గోవాడ ఫ్యాక్టరీ వద్ద మహా ధర్నాకు పిలుపునివ్వడం జరిగింది. ఈ మహా ధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యంతో ఫ్యాక్టరీ పరిధిలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని ఏ రోజు ఫ్యాక్టరీ ఆగిపోతుందో తెలియక తీసుకొచ్చిన చెరుకు ఎండకు ఎండి రికవరీ రాక రైతాంగం ఫ్యాక్టరీ నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఏనాడు లేదని ఈ దృష్టికి కారణమైన విధానాలపై రైతాంగం పెద్ద ఎత్తున పోరాడాలని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సీజనకు చెరకు లేక ఫ్యాక్టరీ మూతపడే పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మూతపడితే ఈ ప్రాంతమంతా ఎడారిగా మారే ప్రమాదం ఉందని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే సహకారంగంలో నడుస్తున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. రైతులు, కార్మికులు బకాయిలకై , ఆధునికరణకై ప్రభుత్వం తక్షణ సాయంగా 35 కోట్లు, ఆధునీకరణ కై రూ. 110 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ ఫ్యాక్టరీ లేకపోతే ఈ ప్రాంతంలో రైతులు, కార్మికులు రోడ్డున పడతారన్నారు.

రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాయకులు ఎస్వి నాయుడు, రైతు సంఘం నాయకులు పి. సాంబశివరావు అప్పలనాయుడు, వి. సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి నదీ గర్భంలో డ్రెడ్జింగ్ తో కోత




కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):- నియో జకవర్గంలో కుమారదేవం, బల్లిపాడు, వేగేశ్వరపురం తదితర గ్రామాల్లో ఓపెన్ రీచ్ లో ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పేదల ఇళ్ల నిర్మాణానికి ఇటువంటి ర్యాంపుల నుండి ఉచిత ఇసుకను అందిస్తున్నట్లు ప్రకటించిన విషయం అందరికీ తెలిసినదే. కానీ దానికి పూర్తి విరుద్ధంగా ఓపెన్ ర్యాంపులో ట్రాక్టర్ల కు, ఎడ్లబండ్ల కు ఉచిత ఇసుక అమలు కావడం లేదనీ పలువురు ఆవేదన. బాట పేరుతో ట్రాక్టర్ల వద్ద సొమ్ము వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓపెన్ రీచ్ కి సంబంధించి ఇసుక లావాదేవీలు కేవలం ఎడారిగా ఉన్న ప్రాంతం నుండి ఇసుక తవ్వకాలు జరిపి అమ్మకాలు జరపాలి కానీ ఓపెన్ రీచ్ లో ఇసుక లేకపోవడం వల్ల నదీ గర్భాన్ని తవ్వేస్తూ (డ్రెడ్జింగ్ మాటున) ఇసుక అమ్మకాలు జరపడం పట్ల స్థానికులు పలు అనుమానాలు వ్యక్త పరుస్తున్నారు. ఓపెన్ రీచ్ కి సరిపడా ఇసుక లేనప్పుడు అనుమతులు ఎలా ఇచ్చారు అనేది మరొక ప్రశ్న.? నదీ గర్భంలో బాటలు వేయడానికి అధికారికంగా అనుమతులు ఉన్నాయా లేవా అని ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా ఇసుక తవ్వుతున్న ప్రాంతంలో మంగళవారం రాత్రి మైనింగ్ అధికారులు దాడి చేసి డ్రెడ్జింగ్ బోట్, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఏది ఏమైనా గంగమ్మ తల్లి నదీ గర్భాన్ని కోసేస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్న ర్యాంపు లపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## చోరి కేసులో ముద్దాయి అరెస్ట్



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- మేకల హరి కిరణ్ అలియాస్ పండు తండ్రి లేట్ రాము, వయసు 19 సం రాలు, కులం ఎస్ టి ఎరుకుల, సెంట్రింగ్ వర్క్స్ మేదరి వీధి, గొలుగొండ మండలం కృష్ణా దేవి పేటకు చెందిన ఈ వ్యక్తిని మధ్యవర్తుల సమక్షంలో నర్సిపట్నం టౌన్ పోలీస్ వారు అరెస్టు చేసి, సదరు ఆసామి వద్ద ఉన్న ఏ పి 40ఈ ఎన్ 9332 రిజిస్ట్రేషన్ నెంబర్ కలిగిన నలుపు మరియు ఎరుపు రంగు రాయల్ ఎన్ఫీల్డ్ హంటర్ బండి కేసులో చోరీ ఆస్తిగా గుర్తించి వశపరుచుకొని, అతనిని రిమాండ్ కు తరలించడమైనది అని పట్టణ సీఐ తెలిపారు.

## ఎంఎఫ్ హుసేన్ పెయింటింగ్‌కు వేలంలో రూ.118కోట్లు



ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుసేన్ గీసిన ఓ పెయింటింగ్ అరుదైన రికార్డు సృష్టించింది. ప్రముఖ వేలం సంస్థ క్రిస్టీ . న్యూయార్క్‌లో తాజాగా నిర్వహించిన వేలంలో హుస్సేన్ గీసిన 'అన్‌టైటిల్డ్ (గ్రామ్ యాత్ర)' కళాఖండం 13.8మిలియన్ డాలర్ల (రూ.118 కోట్లు)కు అమ్ముడు పోయింది. దీంతో ఆధునిక భారత చరిత్రలో అత్యంత ఖరీదైన కళాకృతిగా ఇది రికార్డు సృష్టించింది.

ప్రముఖ ఆర్టిస్ట్ అమృతా షెర్గిల్ 1937లో గీసిన 'ది స్టోరీ టెల్లర్ ' పెయింటింగ్‌ను 2023లో వేలం వేయగారూ.61.8కోట్ల ధర పలికింది. అత్యంత ఖరీదైన భారతీయ కళాకృతిగా ఇప్పటివరకు ఇదే కొనసాగగా.. తాజాగా ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ దీని కంటే రెట్టింపు ధర పలకడం విశేషం. ఎంఎఫ్ హుస్సేన్ కుంచె నుంచి జాలువారిన 'గ్రామ్ యాత్ర' ఒకే కాన్వాస్‌లో 13 రకాల చిత్రాలతో రూపుదిద్దుకొంది. ఈ అద్భుత కళాఖండం కొత్త రికార్డు సృష్టించడంలో భాగస్వామ్యమైనందుకు సంతోషంగా ఉందని వేలం సంస్థ క్రిస్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## పదవీ విరమణ వయస్సులో మార్పులు చేసే ఉద్దేశం లేదు



న్యూఢిల్లీ బ్యూరో : ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సులో మార్పులు చేసే ఉద్దేశ్యం లేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. బుధవారం లోక్‌సభలో సౌగతా రాయ్, గణపతి రాజ్‌కుమార్‌లు ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సుకు సంబంధించి పలు ప్రశ్నలు వేశారు. ప్రభుత్వ ఉద్యోగులపదవీ విరమణ వయస్సుకు సంబంధించి ఏవైనా మార్పులు చేస్తున్నారా?.. ఉద్యోగుల రిటైర్‌మెంట్ ద్వారా ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయడానికి ఏదైనా పాలసీ ఉందా? అని ప్రశ్నించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మధ్య పదవీ విరమణ వయస్సులో ఎందుకు తేడాలు ఉన్నాయని వారు అడిగారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణతో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయడానికి ఎలాంటి పాలసీ లేదని స్పష్టం చేశారు. దానిపై జరుగుతున్న ప్రచారాలను ఆయన ఖండించారు. నేషనల్ కౌన్సిల్ స్టాఫ్ దగ్గరినుంచి పదవీ విరమణ వయస్సు మార్పుకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదన రాలేదన్నారు. పదవీ విరమణ వయస్సుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్య ఉన్న వ్యత్యాసాలపై ఆయన సమాధానం ఇస్తూ.. ' కేంద్రం అలాంటి వాటికి సంబంధించిన డేటాను మెయింటేన్ చేయదు. అది రాష్ట్రానికి సంబంధించింది' అని అన్నారు. కాగా, ప్రస్తుతం కొన్ని రంగాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్ ఏజ్ 60 సంవత్సరాలుగా ఉంది. మరికొన్ని రంగాల్లో పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాల వరకు ఉంది. ఇక, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగులకు సంబంధించి సొంత రిటైర్‌మెంట్ ఏజ్ పాలసీని అమలు చేస్తున్నాయి. అలాగే శాఖ వారీగా పదవీ విరమణ వయస్సులో తేడాలు ఉంటున్నాయి.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.